# మండలంలో దంచి కొట్టిన వాన..విరిగిన చెట్లు...



న్యాల్‌కల్‌లో ఇంటి ముందు నిలిచిన వర్షపు నీరు

**న్యాల్‌కల్, మే 27, ప్రభాతవార్త:** మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు మండలంలోని ఆయా గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. మండలంలో 74.4 మి.మీ వర్షం పాతం నమోదైనట్లు రెవిన్యూ రికార్డులు ధృవీకరిస్తున్నాయి. గంటల తరబడి కురిసిన భారీ వర్షానికి గ్రామాల్లోని కాలువలు, వంకలు పొర్లినాయి. పలు గ్రామాల్లో చెట్లు నేలకొరిగాయి. గంగ్వార్-అల్లాదుర్గం రోడ్డుపై చెట్టు విరిగిపోవడం ప్రయాణికులు కొంత అవస్థలకు గురికావాల్సి వచ్చింది.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట



వార్త

## ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తాం : ఆర్డీఓ రమాదేవి

**చిన్నశంకరంపేట, మే 27,ప్రభాతవార్త:** రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని, ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని మెదక్ ఆర్డీఓ రమాదేవి తెలిపారు.బుధవారం రుద్రారంలో కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యాన్ని ఆమె పరిశీలించారు. ధాన్యం సేకరణలో అనవసర గందరగోళానికి గురికావద్దన్నారు. లారీలను కొనుగోలు కేంద్రాలకు తరలించేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు. ధాన్యం సేకరణ పూర్తయ్యేవరకు కొనుగోలు కేంద్రాలు ఉంటాయన్నారు. ఆమె వెంట తహసీల్దార్ మాలతి, ఆర్ఐ రాజులు ఉన్నారు.



కొనుగోలుకేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందిస్తున్న సర్పంచ్‌లు

## అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి

**హుస్నాబాద్ రూరల్, మే 26, ప్రభాతవార్త :** అక్కన్నపేట మండలానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సర్పంచులు బుధవారం అభివృద్ధి పనుల విషయంలో హుస్నాబాద్ శాసనసభ్యులు, మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పలు అభివృద్ధి అంశాలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సమస్యలు, విద్యుత్ సదుపాయాలు, అంతర్గత రహదారుల అభివృద్ధి తదితర అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి పనులను వేగవంతం చేయాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి గ్రామాల అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు సర్పంచులు తెలిపారు. మంత్రిను కలిసినవారిలో సర్పంచ్‌లు మాలోతు మనీ కనుకనాయక్, బొడ్డు ఈశ్వర్, భూక్య కృష్ణ నాయక్, బాలరాజు, కేశ్‌నాయక్‌తండా సర్పంచ్ సులోచన దేవన్ నాయక్ ఉన్నారు.

## కేంద్ర మంత్రిని కలిసిన బిజెపి నేతలు

**హుస్నాబాద్ రూరల్/ అక్కన్నపేట, మే 27, ప్రభాతవార్త**



కేంద్ర మంత్రిని కలిసిన బిజెపి నాయకులు

కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్‌ను బుధవారం కరీంనగర్‌లో బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి కలిసి రైతుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం, మిల్లర్ల వైఖరి కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని కేంద్ర మంత్రికి తెలిపారు. అలాగే మొక్కజొన్న కొనుగోళ్లను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, నెల రోజులుగా మార్కెట్‌యార్డుల్లో రైతులు పడిగాపులు కాస్తున్నప్పటికీ కనీసం గోనె సంచులు అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను లేవనెత్తితే ప్రభుత్వం ఎదురుదాడికి దిగుతోందని ఆరోపిస్తూ, రైతుల ఇబ్బందుల పరిష్కారానికి తగిన పోరాట కార్యక్రమాలను రూపొందించాలని కేంద్ర మంత్రిని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో అక్కన్నపేట మండల అధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి, ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## టిపిసిసి జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్‌గా కరుణాకర్



నియామకపత్రం అందుకుంటున్న మల్కగల్ల కరుణాకర్

**గజ్వేల్ టౌన్, మే 27 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం రిమ్మనగూడ గ్రామ సర్పంచ్ మల్కగల్ల కరుణాకర్‌కు అరుదైన గౌరవం దక్కింది. టిపిసిసి సిద్దిపేట జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్‌గా నియమిస్తూ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేయగా, ఢిల్లీలోని ఏఐసిసి ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జాతీయ, రాష్ట్ర స్థాయి ముఖ్య నేతల సమక్షంలో కరుణాకర్ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన ఏఐసిసి నాయకత్వానికి, రాష్ట్ర నేతలకు, గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ తూంకుంట నర్సారెడ్డి, డిసిసి అధ్యక్షులు ఆంక్షరెడ్డిలకు రుణపడి ఉంటానన్నారు. దళిత సామాజిక వర్గ సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడానికి నిరంతరం శ్రమిస్తానని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

## టిజిపాలిసెట్ 2026 ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

**నారాయణఖేడ్, మే 27 ప్రభాతవార్త :** రాష్ట్ర పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టీజీపాలిసెట్ 2026) ద్వారా పాలిటెక్నిక్ కళాశాలలలో ప్రవేశాల కోసం మొదటి విడత కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ నారాయణఖేడ్ ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులు నెల 27 నుండి 31వ తేదీవరకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు మరియు స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ 29వ తేది నుండి జూన్ 1వ తేది వరకు నిర్వహించబడుతుందని, వెబ్ ఆప్షన్లు 29వ తేది నుండి జూన్ 3వ తేదీవరకు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. సీట్ల ప్రాథమిక కేటాయింపు జూన్ 6వ నాటికి విడుదల కానుంది. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని 59 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను హెల్ప్‌లైన్ సెంటర్లుగా ప్రభుత్వం గుర్తించగా, ప్రభుత్వ పాలిటెక్నిక్ నారాయణఖేడ్ అధికారిక హెల్ప్‌లైన్ సెంటర్‌గా ఎంపికైందని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు కళాశాలకు వచ్చి సర్టిఫికెట్ వెరిఫికేషన్, వెబ్‌ఆప్షన్ల నమోదు, ప్రవేశాల వివరాలపై మార్గదర్శకత్వం పొందవచ్చని సూచించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ నారాయణఖేడ్‌లో ఆధునిక సదుపాయాలతో డిప్లొమా విద్య అందిస్తున్నామని, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రూపొందించిన పాఠ్య ప్రణాళిక, ఐఐటీ హైదరాబాద్, టాటా టెక్నాలజీస్ మరియు పరిశ్రమల పర్యవేక్షణలో రూపొందించిన నూతన కరికులమ్ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందిస్తున్నామని తెలిపారు.పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రభుత్వ పాలిటెక్నిక్ నారాయణఖేడ్‌లో ప్రవేశాలు పొందాలని ప్రిన్సిపాల్ కోరారు.

# తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
జిల్లాలో మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆధునిక వ్యవసాయ మార్కెట్ కమిటీలో ధాన్యం కొనుగోలు దిగుమతి ప్రక్రియను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు.అనంతరం ఆమె తడిసిన వడ్లను పరిశీలించి జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జిల్లాలో ప్రారంభించిన 427 కొనుగోలు కేంద్రాలో సజావుగా ధాన్యం కొనుగోలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటివరకు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని ఇంక లక్ష మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. అకాల వర్షాలు వల్ల కొంత ధాన్యం తడిసిందని, ఆ ధాన్యాన్నీ కొనుగోలు చేసి బాయిల్డ్ రైస్ మిల్లులకు పంపించడం జరుగుతుందని తెలిపారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం వివరాలను పూర్తిగా సేకరించి కొనుగోలు చేసేందుకు సంసిద్ధంగా ఉన్నామని రైతులు ఆందోళన చెందకుండా ప్రభుత్వానికి సహకరించాలన్నారు. ఆమె వెంట డిఎం మార్కెటింగ్ నాగరాజు, తహశీల్దార్ కిరణ్ తదితరులు ఉన్నారు.



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

### ధాన్యం దిగుమతిని వేగవంతం చేయాలి...

**చేర్యాల, మే 27, ప్రభాతవార్త :** మిల్లుల్లో ధాన్యం దిగుమతి ప్రక్రియను వేగవంతం చేయాలని సిద్దిపేట కలెక్టర్ హైమావతి మిల్లర్ యజమానులకు తెలిపారు. బుధవారం చేర్యాల మండలంలోని వీరన్నపేటలోని శివసాయి బాలాజీ రైస్‌మిల్, ముస్త్యాల గ్రామశివారులోని శ్రీరేణుక బాయిల్డ్ రైస్ ఇండస్ట్రీలో దిగుమతి ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మిల్లులలో 30 వాహనాల ధాన్యం దిగుమతికి తయారుగా ఉందని వాటిని యుద్ధప్రాతిపాదకన దిగుమతి చేసుకోవాలన్నారు. మిల్లుల్లో దిగుమతి జాప్యం కావడం వల్లే కొనుగోలు కేంద్రాలకు లారీల కొరత ఏర్పడిందని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో స్థానిక హమాలీలు పనిచేస్తే మిల్లులో దిగుమతికి ఆలస్యం కాదన్నారు. ధాన్యం దిగుమతి కాగానే మిల్లర్ అక్నాలజ్మెంట్, ట్రక్ షిట్ జెనరేట్, ఓపిఎంఎస్ అప్లోడ్ పెండింగ్ ఉంచకుండా వెంటనే పూర్తి చెయ్యాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ దిలీప్‌కుమార్ తదితరులు ఉన్నారు.



సర్వీసు రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం వర్షానికి కొట్టుకుపోయిన దృశ్యం

## వర్షానికి కొట్టుకుపోయిన ఆరబెట్టిన ధాన్యం

**చౌటకూరు, మే 27, ప్రభాతవార్త:** అవసరానికి సరిపడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నెలరోజులుగా రైతులు వినతి, రాస్తారోకోలు నిర్వహిస్తున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో రోడ్డుపై ఆరబెట్టుకున్న ధాన్యం కురిసన అకాల వర్షానికి వరద పాలైంది. మండల పరిధిలోని 161వ జాతీయ రహదారి సర్వీసు రోడ్డుపై రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకున్నారు. అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి రోడ్డుపై ఆరబెట్టుకున్న ధాన్యం వరద పాలైందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని కోర్పోలు గ్రామ సర్పంచ్ బచ్చుగూడెం సునీత ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్పోలులో డీసీఎంఎస్‌కు అదనంగా మరో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని నెల రోజులుగా నెత్తినోరు మొత్తుకుంటున్నా అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ పాండు ముందు ఏకరవు పెట్టుకోగా అధికారులు గ్రామానికి వచ్చిపోయారే తప్పితే సమస్యను పరిష్కరించింది లేదని విచారం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రంలో సరిపోను హమాలీలను ఏర్పాటు చేస్తే కొంత వరకు సమస్య తొలిగే అవకాశం ఉందని సర్పంచ్ పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి లారీల, హమాలీల కొరత లేకుండా చూడాలని రైతులు వినతి చేస్తున్నారు. చౌటకూరు, వెండికోలు గ్రామాల్లో తడిసిన ధాన్యాన్ని తహసీల్దార్ నామాల కిష్టయ్య, ఆర్ఐ ప్రమోద్‌కుమార్‌లు పరిశీలించారు.

### త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ : హరీష్‌రావు

**సిద్దిపేట రూరల్, మే 27, ప్రభాతవార్త :** బక్రీద్(ఈద్-ఉల్-అధా) పర్వదినం సందర్భంగా మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు బుధవారం ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తి, త్యాగానికి ప్రతీకంగా నిలిచే ఈ పండుగ అందరి జీవితాల్లో సుఖశాంతులను నింపాలని అకాంక్షించారు. త్యాగం,సహనం బక్రీద్ పండుగ ఇచ్చే గొప్ప సందేశాలన్నారు. ఈ ఏడు హజ్ యాత్ర పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.



మాట్లాడుతున్న ఎసిపి సౌదారపు సదానందం

## ఇంట్లోనే దొంగతనం నాటకం.. చెల్లెలే నిందితురాలు

### నిద్రలో ఉన్న అక్క మెడలోని బంగారం కట్ చేసి దాచిపెట్టిన ఘటన

### క్ష చాకచక్యంగా కేసు ఛేదించిన హుస్నాబాద్ పోలీసులు

హుస్నాబాద్ రూరల్, మే 27, ప్రభాతవార్త :
మండల పరిధిలోని పోతారం (ఎస్) గ్రామంలో చోటుచేసుకున్న బంగారు ఆభరణాల దొంగతనం కేసును పోలీసులు గంటల వ్యవధిలోనే ఛేదించారు. ఈ ఘటనలో బాధితురాలి స్వంత చెల్లెలే నిందితురాలిగా తేలడం స్థానికంగా సంచలనంగా మారింది. పోలీసుల వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం సుమారు 9 గంటల సమయంలో పోతారం (ఎస్) గ్రామానికి చెందిన బొయిని మంజుల ఇంటి ముందు వరండాలో నిద్రిస్తున్న సమయంలో ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడు, బంగారు చైన్, చెవి కమ్మలు గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు సమాచారం అందింది. సమాచారం అందుకున్న హుస్నాబాద్ ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి తన సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని బాధితురాలి ఫిర్యాదు స్వీకరించి అక్కడికక్కడే కేసు నమోదు చేశారు. అనంతరం చేపట్టిన విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. బాధితురాలి స్వంత చెల్లెలు బొయిని విజయ భారతి, ఆమె నాల్గవ అక్క కూతురు (మైనర్) సహాయంతో ఈ దొంగతనానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.

రాత్రి సుమారు 2:30 గంటల సమయంలో బాధితురాలు గాఢనిద్రలో ఉండగా వైర్ కట్టర్‌తో మెడలోని బంగారు పుస్తెల తాడు, చైన్ కట్ చేసినట్లు తేలింది. అనంతరం అనుమానం రాకుండా ఉండేందుకు మైనర్ బాలిక చెవి కమ్మలను కూడా తీసి, మొత్తం ఆభరణాలను ప్లాస్టిక్ కవర్‌లో పెట్టి ఇంటి ముందు ఉన్న లంద గోళం కింద దాచిపెట్టినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో నిందితురాలిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసును వేగంగా ఛేదించడంలో ప్రతిభ కనబర్చిన హుస్నాబాద్ సీఐ కొండ్రు శ్రీను, ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి, కానిస్టేబుళ్లు నీలం సంపత్, నంగునూరి నరేష్‌లను హుస్నాబాద్ ఏసీపీ సౌదారపు సదానందం అభినందించారు.

# తడిసిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలి

### మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్‌రావు

**చిన్నకోడూరు, మే 27, ప్రభాతవార్త :** ప్రభుత్వం సకాలంలో వడ్లు కొనుగోలు చేయకపోవడంతోనే అకాల వర్షానికి తడిసి ముద్దయిందని, ఎలాంటి ఆంక్షలు లేకుండా తడిసిన ప్రతి గింజను కొనుగోలుచేయాలని మాజీమంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ తన్నీరు హరీష్‌రావు డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లాలోని చిన్నకోడూరు, గోనెపల్లి, ఇబ్రహీంనగర్ గ్రామాల్లో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని అధికారులు,పార్టీ శ్రేణులతో కలిసి బుధవారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు హరీష్‌రావు ఎదుట కన్నీళ్లు పెట్టుకున్నారు. రైతులు ఆధైర్యపడొద్దని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. వారం రోజులపాటు ఇసుక రవాణా ఆపి...ఆ లారీలను ధాన్యం కోసం వినియోగించాలన్నారు. క్వింటాల్‌కు 5 కిలోల తరుగు, ఏ-గ్రేడ్‌కు బీ-గ్రేడ్ ధరతో మిల్లర్లు రైతులను నిలువునా దోచుకుంటున్నారని వాపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బాధ్యతలను పూర్తిగా విస్మరించి రైతులను మోసం చేస్తూ నాటకాలు ఆడుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సిఐ లెవీ కోటాను ఎరువుల కోటాను రాష్ట్రానికి సకాలంలో ఇవ్వకుండా మోసం చేస్తుంటే కాంగ్రెస్ సర్కార్ రైతులను గాలికి వదిలేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఎరువులకు, వడ్ల కొనుగోలుకు ఇబ్బంది రాలేదన్నారు. రాష్ట్రంలో 80 శాతం వడ్లు కొన్నామని సిఎం హైదరాబాద్‌లో ఏసీరూంలో కూర్చొని ప్రగల్బాలు పలుకుతున్నారని ఏ మార్కెట్‌కెళ్లినా ఇంకా సగం ధాన్యం కల్లాల్లోనే ఉందన్నారు. సిఎంతో పాటు మంత్రులు స్పందించి కలెక్టర్లు, డిఆర్డీఏ, తహసీల్దార్ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ పెట్టి తడిసిన ధాన్యాన్ని యుద్ధప్రాతిపదికన బాయిల్డ్ రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. రైస్ మిల్లర్లు బస్తాకు 43 కిలోలు పెడితేనే దించుకుంటామని లేకపోతే మిల్లుల దగ్గరకు రావొద్దని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని మండిపడ్డారు. ఏ-గ్రేడ్ వడ్లను బీ-గ్రేడ్ కిందరాస్తూ ఎకరాకు రూ.6700 అలాగే క్వింటాల్‌కు 3 నుంచి 5 కిలోల తరుగు పేరుతో మరో రూ. 3 వేలు ఒక్కో రైతు రెండు రకాలుగా వేలాది రూపాయలు నష్టపోతున్నారని తెలిపారు.రవాణా, హమాలీ, ట్రాక్టర్ల వెయిటింగ్ చార్జీలు, కాంటా డబ్బులు అన్ని రైతుల నెత్తినే రుద్దుతూ ప్రభుత్వం పూర్తిగా రైతు వ్యతిరేకంగా వ్యవహారిస్తుందన్నారు. బిజెపి ఎంపిలు ఇక్కడ ధర్నాలు చేయడంకాదు ఢిల్లీకి వెళ్లి రాష్ట్రానికి కోటా పెంచేలా కొట్లాడాలన్నారు. కేంద్ర సర్కార్ మూడుసార్లు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి రూ.3 వేల కోట్ల భారం మోపితే రాష్ట్ర ప్రభుత్వం వ్యాట్ పెంచి మరో రూ.2 వేల కోట్ల భారం మోపిందన్నారు. ఇద్దరు కలిసి రూ. 5 వేల కోట్లు దోచుకుంటూ రైతుల, సామాన్యుల నడ్డి విరుస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రైతులను ఆగం చేస్తున్నారని తెలిపారు. ఆయన వెంట పార్టీ ప్రజా ప్రతినిధులు, పార్టీశ్రేణులు రాధాకృష్ణశర్మ, కూర మాణిక్యరెడ్డి, కాముని శ్రీనివాస్,జంగిటి శ్రీనివాస్, కీసర పాపయ్య, తహశీల్దార్ సలీం ఉన్నారు.



చిన్నకోడూరులో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న హరీష్‌రావు

## సహకార సంఘం ఉద్యోగి సస్పెన్షన్

**చిన్నశంకరంపేట, మే 27,ప్రభాతవార్త:** మండల పరిధిలోని చందంపేట సహకార సంఘంలో పనిచేస్తున్న కిష్టారెడ్డిని సస్పెండ్ చేసినట్లు డీసీఓ కరుణకార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2018 సంవత్సరంలో సహకార సంఘం సభ్యుల తీర్మానంతో తాత్కాలిక ఉద్యోగిగా విధుల్లో చేరిన కిష్టారెడ్డి నిబంధనలకు విరుద్దంగా పనులు నిర్వహిస్తున్నట్లు ధర్పల్లికి చెందిన ప్రవిణ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. నర్సాపూర్‌కు చెందిన సీనియర్ ఇన్‌స్పెక్టర్ యాకూబ్ అలీ విచారణ చేపట్టి కిష్టారెడ్డి నియామం నిబంధనలకు విరుద్దంగా ఉన్నట్లు తెలిపారు. కిష్టారెడ్డి విధుల నుంచి తొలగిస్తున్నట్లు డీసీఓ కరుణాకర్ తెలిపారు.

## అప్పుల బాధతో అన్నదాత ఆత్మహత్య

**చిన్నశంకరంపేట, మే 27,ప్రభాతవార్త:** అప్పుల బాధతో అన్నదాత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధి గజగట్లపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం కథనం ప్రకారం... గ్రామానికి చెందిన రాజయ్య(45), ఎల్లవ్వ దంపతులు కాగా వీరికి మహేష్, మణికంఠ, ముఖేష్‌లు సంతానం. వారికి ఉన్న అర్ధఎకరా పొలంలో బోర్లు తవ్వించడంతో అప్పులు పెరిగిపోయాయి. చేసిన అప్పులు తీర్చడానికి సంవత్సరం క్రితం రాజయ్య, ఎల్లవ్వ, మణికంఠలు భాగ్యనగరంలోని జీడిమెట్లకు వలస వెళ్లి కూలీ పనులు చేసుకుంటూ ఉన్నారు. ఇంటి వద్ద మహేష్ పెయింటర్ పనులు చేసుకుంటూ తమ్ముడు ముఖేష్‌ను చూసుకుంటూ ఉండేవాడు. నెల రోజుల క్రితం రాజయ్య ఇంటికి రాగా, చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక తనలోతానే కుమిలిపోయేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో రాజయ్య ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముఖేష్ ఇంటికి వచ్చి తలుపులు తీయగా రాజయ్య ఉరేసుకుని ఉన్న విషయాన్ని గమనించి చుట్టపక్కల వారిని పిలిచి కిందకి దించగా రాజయ్య అప్పటికే మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.

## ముగ్గురు పిల్లలతో కలిసి తల్లి అదృశ్యం

**చిన్నశంకరంపేట, మే 27,ప్రభాతవార్త:** ముగ్గురు పిల్లలతో కలిసి తల్లి అదృశ్యమైన ఘటన మండల పరిధి ఖాజాపూర్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. చిన్నశంకరంపేట ఎస్ఐ శివానందం కథనం ప్రకారం... గ్రామానికి చెందిన స్వామి పేయింటింగ్ పని, భార్య శిరిష కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి స్పందన, సంజన, ఆధ్యశ్రీ ముగ్గురు కూతళ్లు ఉన్నారు. ఆదివారం ఉదయం గ్రామంలో పోచమ్మ పండుగ నిర్వహణ గురించి మాట్లాడటానికి వెళ్లిన స్వామి ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంట్లో భార్య, పిల్లలు కనిపించలేదు. వెంటనే భార్యకు ఫోన్ చేయగా గ్రామంలో ఉన్నామని, పిల్లలు తనవద్దే ఉన్నారని తెలిపింది. సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. గ్రామంలో బంధువుల వద్ద, తెలిసిన వారి ఇంటి వద్ద గాలించినా ఆచూకీ లభించలేదు. స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆటో

### -ఒకరి మృతి.. మరో నలుగురికి గాయాలు

**మొగుడంపల్లి, మే 27, ప్రభాతవార్త:** ముందు వెళున్న ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా నలుగురు గాయాలకు గురైన సంఘటన మండల పరిధిలోని గోవింద్‌పూర్ గ్రామ శివారులో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డి కథనం ప్రకారం... మండలపరిధిలోని రాయిపల్లి తండాకు చెందిన ఆటో జహీరాబాద్ వైపు ప్రయాణీకులతో వెళుతూ ముందుగా వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న చించోలి తాలుకా చంద్రంపల్లి గ్రామానికి చెందిన సునీల్‌రెడ్డి(28) తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు గాయాలకు గురయ్యారన్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేందర్‌రెడ్డి వివరించారు.

## దాడిలో యువకుడి మృతి

**రాయపోల్, మే 27 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని రాంసాగర్ గ్రామానికి చెందిన శ్యామ్‌చారి దాడిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన మంగళవారం సాయంత్రం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం... మిర్‌దొడ్డి మండలానికి చెందిన ఒక వ్యక్తికి రాంసాగర్ గ్రామానికి చెందిన యువతితో వివాహం జరిగింది. కాగా శ్యామ్‌చారికి ఆ వివాహితతో గతంలో పరిచయం ఉండటంతో ఆమెను రెండు రోజుల పాటు ఇంటి నుంచి తీసుకెళ్లి అనంతరం తిరిగి ఇంటి వద్ద వదిలినట్లు తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో ఇరు కుటుంబాల మధ్య వివాదం చోటుచేసుకుంది. దీంతో ఆగ్రహానికి గురైన యువతి కుటుంబసభ్యులు శ్యామ్‌చారిపై దాడిచేసినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని తీవ్రంగా గాయపడిన అతన్ని చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందిన అనంతరం మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు 20 మంది గ్రామస్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మానస వెల్లడించారు.

## పిడుగు పడి పాడిగేదె మృతి

**వర్గల్, మే 27 (ప్రభాతవార్త):** పిడుగు పడి పాడిగేదె మృతిచెందిన సంఘటన వర్గల్ మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. మంగళవారం రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురువగా మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎర్రవల్లి పెద్ద శ్రీనివాస్‌రెడ్డికి చెందిన పాడిగేదె పిడుగుపడి మృతిచెందింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ దాసరి విజయలక్ష్మి యాదగిరి, ఉపసర్పంచ్ సంతోష సత్యనారాయణ, కార్యదర్శి అంబికాలు సంఘటనా స్థలాన్ని పరిశీలించగా, ఆర్ఐ, వెటర్నరీ డాక్టర్ అక్కడికి చేరుకొని పంచనామా నిర్వహించారు.

## తహసీల్దార్ ఎదుట ఇద్దరు వ్యక్తుల బైండోవర్

**బెజ్జంకి, మే 27, ప్రభాతవార్త:** ఇసుక అక్రమ రవాణాచేస్తున్న రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లికి చెందిన బొద్దుల రాకేష్, కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రేణుకుంట గ్రామానికి చెందిన బోయిని ప్రవీణ్‌లను బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎదుట పోలీసులు బైండోవర్ చేశారు.రేణుకుంట నుంచి సిద్దిపేట వైపు బెజ్జంకి మీదుగా అక్రమ ఇసుక రవాణా చేస్తుండగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని తహశీల్దార్ శ్రీకాంత్ ఎదుట బైండోవర్ చేశారు. అక్రమ రవాణా చట్ట రీత్యా నేరమన ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.



తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్న దృశ్యం

## బస్తీ దవాఖానను సందర్శించిన మాజీ కార్పొరేటర్



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మాధవరం రంగారావు

**కెపిహెచ్‌బి కాలనీ, మే 27, ప్రభాతవార్త**

శేర్లింగంపల్లి నియోజకవర్గంలోని వివేకానందనగర్ డివిజన్ వెంకటేశ్వర్ నగర్‌లో ఉన్న బస్తీ దవాఖానాను మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందుబాటులో ఉండేలా బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశారని, గతంలో ఈ బస్తీ దవాఖానాల ద్వారా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సుమారు 60 రకాల వైద్య పరీక్షలు నిర్వహించేవారని అన్నారు. అలాగే అక్కడ పనిచేసే డాక్టర్లు, నర్సులు ఇతర సిబ్బందికి సకాలంలో జీతాలు చెల్లించేవారని అన్నారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ బస్తీ దవాఖానాల వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తోందని ఆయన ఆరోపించారు. ప్రజలకు అందుబాటులో ఉండే 60 రకాల పరీక్షల్లో ప్రస్తుతం కేవలం 20 రకాల పరీక్షలు కూడా నిర్వహించడం లేదని ఆరోపించారు. రేవంత్ సర్కార్ వచ్చిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తున్నామని గొప్పగా చెబుతున్నప్పటికీ, ఇక్కడ పరిస్థితి మాత్రం భిన్నంగా ఉందన్నారు. గత నాలుగు నెలలుగా డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బందికి జీతాలు అందక వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అయినప్పటికీ వారు తమ విధులను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ బాధ్యతాయుతంగా సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎర్ర లక్ష్మయ్య, ఆంజనేయులు, బాబు, శ్రీధర్, రాంబాబు, భీమ్, బాలయ్య, తిరుపతి రావు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ సభ్యత్వ నమోదు జోరుగా చేయాలి..



బిఆర్ఎస్ సభ్యత్వ నమోదు సమావేశంలో మాట్లాడుతున్న పరిశీలకుడు నరేందర్‌గౌడ్

**గోషామహల్,మే 27ప్రభాతవార్త:** బిఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా కోఠిలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలతో కలిసి సమావేశం నిర్వహించారు.గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ సభ్యత్వనమోదు పరిశీలకులునరేందర్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కెసిఆర్ సారథ్యంలో తెలంగాణ ఇంటింటికి సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి బడుగు బలహీన వర్గాలకు అందచేసిన ఘనత పార్టీ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి కె.సి.ఆర్‌కు దక్కుతుందన్నారు.కలిసికట్టుగా బిఆర్ఎస్ సభ్యత్వ నమోదు చురుకుగాచేపట్టాలన్నారు.గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఆర్యంమహేందర్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో అత్యధిక బిఆర్ఎస్ సభ్యత్వ నమోదు చేస్తామన్నారు.తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న వ్యతిరేక విధానాలను కూడా సభ్యత్వ నమోదులో ప్రజలకు వివరిస్తామన్నారు.అన్ని డివిజన్లలో కలిసి కట్టుగా బిఆర్ఎస్ సభ్యత్వ నమోదు చేపడుతామన్నారు.ఈ కార్యక్రమంలోబిఆర్ఎస్ సీనియర్ నాయకులు ముమ్మనేని ఆనంద్‌కుమార్‌గౌడ్, గడ్డంశ్రీనివాస్ యాదవ్,బిజ్జిని శ్రీనివాసులు తమ అభిప్రాయాలను వివరించారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా నాయి బ్రహ్మణుల జన సంస్థ వార్షికోత్సవం..



నాయిబ్రహ్మణులను సన్మానించిన దృశ్యం

**అఫ్జల్‌గంజ్,మే 27ప్రభాతవార్త:**

నాయి బ్రహ్మణులు సంఘటితంగా పోరాడి తమ హక్కులను సాధించుకోవాలని భారత ప్రభుత్వ ఆయుష్‌ఆఫ్ మినిస్ట్రీ సిసిఎం సభ్యులు డాక్టర్ సారంగపాణి అన్నారు.హన్‌మాన్‌టేకిడిలోని బిసి సాధికారత భవన్‌ఆడిటోరియంలో నాయిబ్రహ్మణ జనసంస్థ 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ విభాగాల్లో ప్రతిభావంతులైన పలువురిని పురస్కారాలు అందచేసి సన్మానించారు. ఈకార్యక్రమంలో నాయి బ్రహ్మణజన సంస్థ అధ్యక్షులు, ఎం.శ్రీధర్, ఉపాధ్యక్షులు డాక్టర్ సునీల్‌కుమార్,ప్రధాన కార్యదర్శి జి.నవనీత (సైకాలిజిస్టు),కార్యదర్శి సుధాకర్,సీతారామాలయ ట్రస్ట్ చైర్మన్ ముత్యాల గోవింద్‌రాజు,ప్రొఫెసర్ సావిత్రి,మహిళా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు దుర్గారాణి,టిఎస్ఎఫ్ ఫౌండేర్ చైర్మన్‌జంపాల రాజేష్,మోతే గోపాల కృష్ణ తదితరులను పురస్కారాలను అందచేసి సన్మానించారు.ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

## తెలుగు జాతి కీర్తిని జాతీయ స్థాయిలో నిలిపిన ఎన్‌టిఆర్



కార్యక్రమంలో పాల్గొన్న శాసన మండలి ప్రతి పక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి

**చిక్కడపల్లి మే 27 ( ప్రభాతవార్త ) :**

విలక్షణ పౌరాణిక పాత్రలతో చిత్ర పరిశ్రమలో ఉత్తమ నటుడిగా పేద బడుగు వర్గాల సంక్షేమం కోసం ప్రజల ముఖ్యమంత్రి గా పథకాలు అమలు చేసిన యెన్ టి ఆర్ తెలుగు జాతి కీర్తిని జాతీయ స్థాయిలో నిలిపారని శాసన మండలి ప్రతి పక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి కొని యాడారు. బుధవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ నిర్వహణలో అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ స్థాపకుడు పూర్వ ఆంధ్ర ప్రదేశ్ ముఖ్య మంత్రి నందమూరి తారక రామారావు జయంతి సభ జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ క్రమశిక్షణ పట్టుదల కలిగిన యెన్ టి ఆర్ దేశ రాజకీయాలు లో కీలక పాత్ర పోషించారు అని చెప్పారు ఆయన తన పట్ల ఎంతో అభిమానం చూపారని తనకి శాసన సభ సభ్యునిగా పోటీ చేసే అవకాశం తొలి సారి ఆయనే కల్పించిన మహానుభావుడు అని వివ రించారు గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై సాహితీ కిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు, సంఘ సేవకులు నైషధం సత్యనారాయణ భవాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

# సంక్షేమ హాస్టళ్లలో పిఎంయు విధానం రద్దు చేయాలి

**-తెలంగాణ రాష్ట్ర గురుకుల కాంట్రాక్టర్స్ అసోసియేషన్**





ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న నర్సింహారావు, విజయ్‌కుమార్, కృష్ణారెడ్డి, వెంకటేష్ తదితరులు

**హైదరాబాద్, మే 27,ప్రభాతవార్త:**

తెలంగాణ వ్యాప్తంగా గురుకులాలు, సంక్షేమ హాస్టల్ లో నిత్యావసర సరుకుల సరఫరాకు ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ నిబంధనను వెంటనే తొలగించాలని తెలంగాణ గురుకుల కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నరసింహారావు కోరారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ విధానాన్ని అవలంబించడం ద్వారా కాంట్రాక్టర్లకే కాకుండా విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. స్థానిక కాంట్రాక్టర్లు సరఫరా చేయడం వల్ల నిత్యావసర సరుకులు పరిశుభ్రంగా, తాజాగా ఉండే అవకాశం ఉండి విద్యార్థుల ఆరోగ్యాలు కూడా మెరుగుపడతాయన్నారు. పిఎంయు విధానం ద్వారా సరఫరాను చేపడితే పెద్ద మొత్తంలో కాంట్రాక్టర్లు సరఫరా చేయడం వల్ల నిత్యవసర సరుకులు కుళ్లిపోయి పాడైపోవడం, వినియోగానికి అనువుగా ఉండకపోవడం వల్ల విద్యార్థుల ఆరోగ్యాలు పాడయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. తెలంగాణలో హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచితే ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిని కీర్తించామని, ఇటువంటి నిబంధనలు పెట్టడం ద్వారా చిన్న కాంట్రాక్టర్ల పొట్ట కొట్టడం సరికాదన్నారు. పియుసి నిబంధనలను సవరించడం అంటే కేవలం కాంట్రాక్టర్లకే ప్రయోజనం కాదని విద్యార్థుల ఆరోగ్యల విషయాన్ని కూడ పరిగణలోకి తీసుకోవాలని కోరారు. పండ్లు, పాలు, కాయకూరలు వంటి సరఫరాను గతంలో మాదిరిగానే స్థానికి కాంట్రాక్టర్లకు అప్పంగించి గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల విద్యాహివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, కార్యదర్శులు కృష్ణా రెడ్డి, వెంకటేష్, శ్రీనివాస్, హరిప్రసాద్, నవీన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులను కేంద్ర ప్రభుత్వం మరోసారి మోసం చేసింది





నారాయణగూడ చౌరస్తాలో మద్దతు ధర కాఫీలను దగ్ధం చేసు_్తన్న ఎస్‌కెఎం నాయకులు

**సైఫాబాద్, మే 27 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించకుండా నామ మాత్రంగా పెంచి రైతులను దగా చేసిందని, దీనిని సవరించి రైతులకు మిగులు ఉండే విధంగా మార్చేంత వరకు ఐక్యంగా ఉద్యమిస్తామని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) రాష్ట్ర కన్వీనర్లు హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం నారాయణగూడ చౌరస్తాలో మద్దతు ధర కాఫీలను వారు దగ్ధం చేసి మాట్లాడారు. కన్వీనర్లు తీగల సాగర్, పశ్యపద్మ, బి.రాము, మామిడాల భిక్షపతి, వి.నాగిరెడ్డి, జక్కుల వెంకటయ్య, రవీందర్‌గౌడ్, విజయ్ మాట్లాడారు. 2026 ఖరీఫ్‌కు సీజన్‌కు సంబంధించిన కనీస మద్దతు ధరలను (ఎంఎస్‌పి) నాయమాత్రంగా పెంచుతున్నట్లుగా ప్రకటించడం ద్వారా బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మరోసారి దేశ రైతులను మోసం చెసిందని ధ్వజమెత్తారు. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, డిజీల్, పెట్రోల్, విద్యుత్, నీరు వంటి సాగు పెట్టుబడి ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం ప్రకటించిన ఈ ఎంఎస్‌పి పెంపు ఏమాత్రం సరిపోదన్నారు. ఎంఎస్‌పిని ప్రకటించడం ద్వారా ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో ఉన్న కేంద్ర ప్రభుత్వానికి ఉన్న రైతు వ్యతిరేక స్వభావం మరోకసారి భయటపడిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ విధానంతో ప్రభుత్వం ప్రకటించిన ఎంఎస్‌పికి కంటే తక్కువ ధరలకు పంటలు అమ్ముకోవలసి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే స్వామినాధన్ కమిషన్ చేసిన సిఫార్సులకు అనుగుణంగా ఎంఎస్‌పికి చట్టపరమైన హామీని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. రైతుల డిమాండ్ల సాధన కోసం తాము నిరంతరం ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలి : టిజెఎంయూ



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్

**చిక్కడపల్లి మే 27 ( ప్రభాతవార్త ) :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవమైన జూన్ 2వ తేదీన ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ డేట్ ఆఫ్ అపాయింట్‌మెంట్ ఉత్తర్వులు జారీ చేయాలని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. గతంలో సీఎం, రవాణాశాఖామంత్రి సమక్షంలో కార్మిక సంఘాలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. సీఎం హామీ మేరకు అన్ని యూనియన్లు మొదట విలీనమే కావాలని ఆర్టీసీ ఎండీ కి రాత పూర్వకంగా కూడా తెలియజేశాయన్నారు. రవాణాశాఖా మంత్రి యూనియన్ ఎన్నికలనే ముందు నిర్వహిస్తామని చెప్పడం సరైన విధానం కాదని, మంత్రి ఈ నిర్ణయాన్ని పునరాలోచించుకోవాలని ఆయన కోరారు. కార్మిక సంఘాలన్నీ ఇచ్చిన రాతపూర్వక అభిప్రాయం బహుశా మంత్రి దృష్టికి రాలేదేమోనని అభిప్రాయపడ్డారు. ఆర్టీసీలో ఇద్దరు ముగ్గురు నాయకులు కార్మికుల ముందు ఒకటి, వెనుక ఒకటి మాట్లాడుతూ ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారని హనుమంతు ముదిరాజ్ మండిపడ్డారు. ఇలాంటి మోసపూరిత విధానాలను సదరు నాయకులు వెంటనే మానుకోవాలని, లేనిపక్షంలో ఆర్టీసీ ఉద్యోగుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వం ఇచ్చిన విలీన హామీకి ఇప్పటికే రెండున్నర సంవత్సరాల కాలం గడిచిపోయిందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో మళ్లీ కాలయాపన చేస్తే ప్రభుత్వానికే చెడ్డపేరు వచ్చే అవకాశం ఉందని, కాబట్టి ముఖ్యమంత్రి గారు తక్షణమే స్పందించి జూన్ 2న విలీన ప్రకటన చేయాలని టీజేఎంయూ తరఫున హనుమంతు ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ముఖ్యమంత్రిపై బిఆర్ఎస్ నేతల ఫిర్యాదు





మీడియాతో మాట్లాడుతున్న గెల్లు శ్రీనివాస్‌యాదవ్.

**జూబ్లీహిల్స్, మే 27, ప్రభాతవార్తః**

రెచ్చగొట్టే వ్యాక్యలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు అనిరుద్ రెడ్డి, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్‌లపై కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ నేతలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ నేత గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో ఈ ఫిర్యాదును అందించారు. అనంతరం ఆయన మీడయాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ తో పాటు మరికొంత మంది కాంగ్రెస్ నాయకులు ప్రజా సభలు, సమావేశాలు, మీడియా వేదికలలో బెదిరింపు, హింసను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. సోషల్ మీడియాతోపాటు ఇతర వేదికలలో వైరల్ అవుతున్న వీడియోలలో రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుని అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారన్నారు. ప్రజల్లో భయాందోళనలు కలిగించడంతో పాటు రాజకీయ విద్వేషాలను రెచ్చగొట్టేలా ప్రసంగాలు ఉన్నాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన కొన్ని వ్యాఖ్యలను ఉదహరిస్తూ, అవి చట్టం శాంతి భద్రతలపై ప్రజల్లో ఆందోళన కలిగించేలా ఉన్నాయన్నారు. రాజకీయ విభేదాలు ఉన్న వారిపై బహిరంగ బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఒక పరిశ్రమపై ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడారని, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రత్యర్థులను బెదిరించే విధంగా వ్యాఖ్యలు చేశారన్నారు. ఈ వ్యాఖ్యలు ప్రశాంత వాతవరణాన్ని భంగం కలిగించే విధంగా ఉన్నాయన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడాల్సి న బాధ్యత కలిగిన ప్రజా ప్రతినిధులు పదేపదే హింసాత్మక, బెదిరింపు భాషను ఉపయోగించడం వల్ల రాష్ట్రంలో రాజకీయ వైరం, భయాందోళనలు పెరుగుతున్నాయని ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, వీడియోలు, ఆడియో రికార్డులు, సోషల్ మీడియా పోస్టులు తదితర డిజిటల్ ఆధారాలను సేకరించాలని డిమాండ్ చేశారు. సంబంధిత నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, భవిష్యత్తులో ఇటువంటి రెచ్చగొట్టే ప్రసంగాలను అరికట్టాలని ఆయన కోరారు. ఫిర్యాదు స్వీకరించామని, న్యాయపరమైన సలహా అనంతరం కేసు నమోదును పరిశీలిస్తామని బంజారాహిల్స్ పోలీసులు తెలిపారు.

## కూకట్‌పల్లిలో స్నేహితుడి హత్య...

**-డబ్బు విషయంలో వివాదం... 24 గంటల్లో కేసును చేదించిన పోలీసులు...**

**కెపిహెచ్‌బి కాలనీ, మే 27, ప్రభాతవార్త :** కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసును కూకట్‌పల్లి పోలీసులు అత్యంత వేగంగా స్పందించి కొద్ది గంటల్లోనే ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశా రు.వివరాల్లోకి వెళితే... ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన జంషెద్ అహ్మద్ ప్రస్తుతం కూకట్‌పల్లిలోని రాజీవ్ గాంధీ నగర్ లో నివాసం ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. అతడు తనతో కలిసి నివసిస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన ముకేష్ కుమార్ ఝూతో కలిసి ట్రాన్స్‌ఫార్మర్ తయారీ కంపెనీలో పనిచేస్తున్నాడు.కాగా మంగళవారం రాత్రి ప్రశాంత్ నగర్‌లో ఇద్దరూ మద్యం సేవిస్తున్న సమయంలో డబ్బుల లావాదేవీల విషయంలో మాటా మాటా పెరిగి తీవ్ర వాగ్వాదా నికి దారితీసింది. ఆగ్రహానికి లోనైన జంషెద్ అహ్మద్ అక్కడే ఉన్న కిచెన్ కత్తిని తీసుకొని ముకేష్ కుమార్ ఝూ ఛాతి భాగంలో పొడవడంతో అతడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న వెంటనే కూకట్‌పల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా సంఘటనా స్థల పరిసర ప్రాంతాల సీసీటీవీ ఫుటేజ్‌ను సేకరించి పరిశీలించారు. అలాగే ప్రత్యక్ష సాక్షులను విచారించి, సాంకేతిక ఆధారాలను సేకరించగా నిందితుడి ప్రమేయం నిర్ధారితమైంది.పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వేగంగా గాలింపు చర్యలు చేపట్టి నిందితుడు జంషెద్ అహ్మద్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడు నేరాన్ని ఒప్పుకున్నాడు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసును కూకట్‌పల్లి పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### బిజెవైఎం ఉపాధ్యక్షుడిగా సందీప్‌గౌడ్ నియామకం

**సికింద్రాబాద్, మే 27 ప్రభాతవార్త:**

తెలంగాణ రాజకీయాల్లో యువతకు ప్రాధాన్యత ఇస్తూ భారతీయ జనతా యువమోర్చా (బిజేవైఎం) తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సీతాఫల్‌మండికి చెందిన రుద్రగాని సందీప్ గౌడ్ నియమితుల య్యారు.ఈ సంద ర్భంగా రుద్రగాని సందీప్ గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బిజేవైఎం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్ష పదవిని అప్పగించిన అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. యువత కోసం, తెలంగాణ అభివృద్ధి కోసం, బీజేపీ సిద్ధాంతాల బలోపేతం కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానన్నారు.

## జలమండలి ఉద్యోగ, కార్మికులకు సామాజిక భద్రత కల్పించడమే ధ్యేయం : రాజి రెడ్డి





: ప్రసంగిస్తున్న మొగుళ్ళ రాజి రెడ్డి

**చిక్కడపల్లి మే 27 ( ప్రభాతవార్త ) :** జలమండలిలో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికులకు సామాజిక భద్రత కల్పించడం తోపాటు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పిస్తామని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు, తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజి రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం బాగ్ లింగం పల్లి, వివిఎస్టి యూనియన్ కార్యాలయం భావన సముదాయంలో దాదాపు 800 మంది జలమండలి పర్సనల్ అడ్మినిస్ట్రేషన్ ,ఫైనాన్స్, అకౌంట్స్ విభాగాల ఉద్యోగులు సమావేశమై ఐఎన్‌టీయూసీ అనుబంధ తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్‌కు ఐక్యతతో మద్దతు తెలిపి యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజి రెడ్డి ను భారీ మెజారిటీ తో గెలిపిస్తామని ప్రకటించారు. ఉద్యోగుల హక్కుల కోసం, కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతున్న నాయకుడు మొగుళ్ళ రాజిరెడ్డి నని, మా సంపూర్ణ మద్దతు ఆయనకే ఉంటుందని" స్పష్టం చేశారు. అలాగే తమ శాఖలకు సంబంధించిన పెండింగ్ సమస్యలు, ప్రమోషన్లు, సిబ్బంది కొరత, సంక్షేమ అంశాలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా మొగుళ్ళ రాజిరెడ్డి మాట్లాడుతూ జలమండలి ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారమే నా మొదటి ప్రాధాన్యత అని, ప్రతి ఉద్యోగి గౌరవం, హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతానని, ఉద్యోగుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ జలమండలిలో బలమైన నాయకత్వాన్ని అందిస్తాను అని హామీ ఇచ్చారు. జూన్ 6 న జరిగే జలమండలి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ త్రిశూలం గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఉద్యోగులను మొగుళ్ళ రాజిరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖర్, వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ అధ్యక్షులు కే రాజ్ రెడ్డి, టి.జె.ఎం.ఈ.యు ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర రాజ్ నేతలు ఈ.చంద్రశేఖర్, బి. మహేష్, సైద్ అక్తర్ అలీ, కె.ఆనంద్ రెడ్డి, బి.శంకర్ ప్రకాష్, బి.నర్సింగ్ రావు, వినోద్ గౌడ్, పాల్గొన్నారు..

# శ్రీహరిని అవమానించిన పొంగులేటి దిష్టిబొమ్మ దగ్ధం



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దిష్టిబోమ్మను దగ్గం చేస్తున్న బిసి నాయకులు

**సైఫాబాద్, మే 27 ప్రభాతవార్త:** తన తోటి సహచర మంత్రి అయిన వాకిటి శ్రీహరిపై పేపర్లు విసిరి వేసి మనస్థాపనానికి గురిచేసిన రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తక్షణమే శ్రీహరికి వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నీల వెంకటేష్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో వేలాది మంది బిసిలతో ఆయన నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆనేక మంది కార్యకర్తలు బుధవారం బషీర్‌బాగ్‌లో పొంగులేటి దిష్టిబొమ్మను దగ్ధం చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర మంత్రులు తరుచు బిసిల పట్ల చులకనభావం చూపిస్తూ దుర్భాషలాడుతూ అవమానించడం పరిపాటి అయ్యిందన్నారు. గత శినివారం నాడు విలేకరుల సమావేశంలో పొంగులేటి వాకిటి శ్రీహరిపై పేపర్లు విసరి అవమానించారని ఆరోపించారు. దీంతో శ్రీహరి తీవ్ర మనస్తాపానికి గురైనారని విచారం వ్యక్తం చేశారు. బిసిల పట్ల అగ్రకుల మంత్రులు అవమానిస్తే సహించేది లేదని హెచ్చరించారు. బిసిల జోలికి ఎవరైన వస్తే సహించేది లేదని, అగ్రకుల మంత్రులు, ఎమ్మెల్యేలను గ్రామాల్లో తిరగనీయమని హెచ్చరించారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఒక వ్యాపారవేత్త అని ఆయన తన ఆస్తులను కాపాడుకోవడానికే రాజకీయాల్లోకి వచ్చారని ఆరోపించారు. ఇటీవల పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను కూడా కొంత మంది అవమానించారని, ఇలాంటి సంఘటలను సహించబోమన్నారు. శ్రీనివాస్‌రెడ్డి తక్షణమే శ్రీహరికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు సి.రాజేందర్, అనంతయ్య, అంజి, శివకుమార్ యాదవ్, నరేష్‌గౌడ్, శ్రీధర్, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రమాబాయి అంబేడ్కర్ వర్ధంతి



రమాబాయి చిత్ర పటం వద్ద నేతలు

**అల్వాల్, మే 27 ప్రభాతవార్త:** బాబాసాహెబ్ అంబేడ్కర్ సతీమణి మాత రమాబాయి అంబేడ్కర్ వర్ధంతి భారతీయ జనతా పార్టీ ఆద్వర్యంలో భక్తి శ్రద్దలుతో జరిగింది. ఓల్డ్ అల్వాల్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద రమాబాయి చిత్ర పటానికి పార్టీ నేతలు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాబాసాహెబ్ అడుగుజాడలులో నడుస్తూ ఆయన విజయ గాథలో రమాబాయి పాత్ర కీలకమని పార్టీ కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు సర్కిల్ పార్టీ అధ్యక్షుడు కార్తీక్ గౌడ్, అజయ్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రామ్మోహన్ గౌడ్, అజిత్, సాయి, ఉదయ్ ప్రకాష్, పద్మిని, సుజాత, స్రవంతి, ఉష తదితరులు పాల్గొన్నారు.

### స్వర్గీయ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకు ఘన నివాళి



నివాళులు అర్పిస్తున్న దీపక్‌జాన్

**సికింద్రాబాద్, మే 27 ప్రభాతవార్త:** భారతదేశ మొట్టమొదటి ప్రధానమంత్రి, స్వర్గీయ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని పురస్కరించుకుని నగరంలో ఆయనకు ఘన నివాళులు అర్పించారు. తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్, సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దీపక్ జాన్ నేతృత్వంలో పలు ప్రాంతాల్లో నివాళులర్పించే కార్యక్రమాలు జరిగాయి. సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని సిసి నగర్, బన్సీలాల్‌పేట్ డివిజన్లతో పాటు అబిడ్స్ జీపీఓ వద్ద ఉన్న జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహాలకు, చిత్రపటాలకు దీపక్ జాన్ పూలమాలలు వేసి ఘనంగా అంజలి ఘటించారు. నవభారత నిర్మాణంలో నెహ్రూ చేసిన సేవలను ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ కమిటీకి చెందిన ముఖ్య అధికార ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## పెండింగ్ సిసి రోడ్డు,డ్రైనేజీ పనులు చేపట్టండి

**-డిఈకి బిఆర్ఎస్ నేతల వినతి**



**అత్తాపూర్ మే27 ,ప్రభాతవార్త :**

పెండింగ్‌లో ఉన్న సిసి రోడ్డు,డ్రైనేజీ పనులు వెంటనే చేపట్టి సమస్యలను పరిష్కరించాలని పలువురు బిఆర్ఎస్ నేతలు డిఈని కోరారు.బుధవారం రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి కార్యాలయంలో డిఈని బిఆర్ఎస్ నేతలు ఎర్రోళ్ల యాదయ్య,సరికొండ దుర్గేష్,వీర్లపల్లి నవీన్ కుమార్,వల్లూరి విజయ్‌లు కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా గగన్‌పహాడ్ గ్రామంలోని వివేకానంద స్ట్రీట్ వికార్ సెక్షన్ కాలనీలో గత కొద్దిరోజుల నుండి సిసి రోడ్డు,డ్రైనేజీ పనులు పెండింగ్ ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.కావున వెంటనే స్పందించి పనులు చేపట్టాలని విజ్ఞాప్తి చేశారు.దేవిధంగా విధి దీపాలను కూడా ఏర్పాటు చేయాలన్నారు.సానుకూలంగా స్పందించిన డిఈ సిసి రోడ్డు,డ్రైనేజీ,విధి దీపాల పనులను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## బంజారాహిల్స్‌లో తాగునీటి వృధా..

### రూ. 10వేల జరిమానా





బంజారాహిల్స్‌లో తాగునీటిని వృధా చేస్తున్న వ్యక్తి

**జూబ్లీహిల్స్, మే 27, ప్రభాతవార్తః**

బంజారాహిల్స్‌లో తాగునీటిని వృధా చేస్తున్న ఒక వ్యక్తికి జలమండలి అధికారులు రూ. 10వేల జరిమానా విధించారు. జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి బుధవారం బంజారాహిల్స్‌లో ప్రధాన రహదారిపై వెళ్తున్న క్రమంలో రోడ్ నంబరు 12లోని అరెంజ్ ట్రీ ఫర్నీచర్ షాపుకు సంబంధించిన వ్యక్తి జలమండలి సరఫరా చేసే నీటతో ప్రాంగణాన్ని కడుగుతూ కనిపించాడు. దీంతో ఆగ్రహించిన ఎండీ అశోక్‌రెడ్డి తాగునీటిని ఇతర అవసరాలకు వినియోగించడం పట్ల హెచ్చరించారు. అతనికి నోటీసు అందించి జరిమానా వేయాలని సబంధిత జలమండలి మేనేజర్‌ను ఆదేశించారు. దీంతో ఆయా వ్యక్తికి రూ. 10వేల జరిమానా విధించారు. జలమండలి సరఫరా చేసే తాగునీటిని వృధా చేయవద్దని, ఇతర అవసరాలకు వినియోగించ వద్దని ఎండి కోరారు. ఎవరైనా ఇలాంటి పనులు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## ప్రేమ, పెళ్లి అంటూ మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు

**జూబ్లీహిల్స్, మే 27, ప్రభాతవార్తః**

ప్రేమ, పెళ్లి పేరుతో ఒక యువతిని మోసగించిన యువకుడిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. నిజామాబాద్ ప్రాంతానికి చెందిన యువతి(25) గత మూడు నెలల నుండి బంజారాహిల్స్ రోడ్ నంబరు 12లోని ఎమ్మెల్యేకాలనీలో ఒక రోగికి సహాయకురాలిగా ఉంటుంది. నిజామాబాద్ ప్రాంతానికి చెందిన లోకేష్ ప్రశాంత్‌తో యువతికి అయిదేళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలోనే యువతిని ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని లోకేష్ ప్రశాంత్ నమ్మించాడు. దీంతో ఇద్దరు కలిసి చెట్టాపట్టాలేసుకొని తిరిగారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెకు మరింత దగ్గరయ్యాడు. తరుచూ నిజామాబాద్ నుండి నగరానికి వచ్చి ఏకాంతంగా గడిపారు. వారం రోజుల క్రితం యువతి పెళ్లి చేసుకోవాలని కోరగా పెళ్లి చేసుకొనే ఉద్దేశం లేదని, తనపై ఒత్తిడి తీసుకురావద్దంటూ తేల్చిచెప్పాడు. మోసపోయానని గ్రహించిన యువతి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి నిజామాబాద్ పట్టణ ఠాణాకు కేసు బదిలీ చేయనున్నట్లు బంజారాహిల్స్ పోలీసులు తెలిపారు.

## లైంగిక దాడి కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలు

**అత్తాపూర్ మే27 ,ప్రభాతవార్త :**

లైంగిక దాడి,ఫోక్సో చట్టం కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలు శిక్షను విధిస్తూ ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయమూర్తి తిర్పునిచ్చారు. రాజేంద్రనగర్ సిఐ ముత్తు యాదవ్ వివరాల ప్రకారం...చంద్రయణగుట్ట బండ్లగూడ పరిధిలోని గౌస్ నగర్‌లో ఉండే సయ్యద్ యూసుఫ్ (46) ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు.24-10-2020లో మాధ్యాహ్నం రాజేంద్రనగర్‌లోని హైదర్‌గూడలో నివాసం ముందు బాలిక సోదరితో కలిసి ఆడుకుంటుండుగా అటుగా వచ్చిన నిందితుడు వారద్దరిని తన ఆటోలో ఎక్కించుకొని అసభ్యకరంగా ప్రవర్తించి అనంతరం ఇంటి వద్ద వదలేసి వెళ్లాడు.బాలిక జరిగిన ఘటనను తల్లికి వివరించడంతో రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి ఆధారాలను కోర్టులో సమర్పించగా అత్యాచారం కేసులో నిందితుడు సయ్యద్‌కు బుధవారం ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయమూర్తి దోషిగా నిర్ధారిస్తూ 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు 50వేల జరిమానా బాధితులకు రూ.3లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించినట్లు తెలిపారు.ఈ కేసుల్లో నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన అప్పటి ఎసిపి అశోక్ చక్రవర్త,పిపి వెంకటేశ్వర రెడ్డి,సిడిఓ కృష్ణయ్య,సమన్ల అధికారులు నరసింహు, ఎస్ఐ శివరెడ్డిలను పోలీసులు కమిషనర్ అభినందించారు.


తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి

## ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం

### మాజీ ఎమ్మెల్యే రసమయి

**బెజ్జంకి, మే 27, ప్రభాతవార్త :** ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని పరిశీలించడంతో పాటు రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాలలో తడిసి పోయిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే అకాల వర్షానికి తడిసిపోయిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని, అలాగే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో బిఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి కనగండ్ల కవిత, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శ


వర్షానికి దెబ్బతిన్న ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

**బెజ్జంకి, మే 27,ప్రభాతవార్త :** మండల పరిధిలోని కల్లేపల్లి గ్రామంలో అకాల వర్షంతో తీవ్రమైన ఈదురుగాలులతో నష్టపోయిన బాధిత కుటుంబాలను బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించారు. అకాల వర్షంతో ఇండ్లు దెబ్బతిన్న బాధితులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ధైర్యంగా ఉండాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలలో జరిగిన నష్టాన్ని అంచనా వేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యాన్ని, తడిసిన ధాన్యాన్ని చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ సర్కార్ రైతులకు అండగా నిలుస్తుందన్నారు. ఆయన వెంట ప్రజాప్రతినిధులు, ఎఎంసి చైర్మన్, వైస్ చైర్మన్ పార్టీ నాయకులు లింగాల శ్రీనివాస్, పులి కృష్ణ, చిలువేరు శ్రీనివాస్‌రెడ్డి, గూడెల్లి శ్రీకాంత్, బిగుళ్ల మోహన్, పులి రమేష్, ముక్కిస రత్నాకర్‌రెడ్డి, జెల్ల ప్రభాకర్,రావుల నర్సయ్య, ర్యాకం రాజు, పులి సంతోష్,జంగిలి తిరుపతి, రొడ్డ మల్లేశం, ఎలిగే సతీష్ తదితరులు ఉన్నారు.

## ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు

### కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం.డి.ఇమామ్



తడిసిన ధానాన్ని కొనుగోలు చేయాలని ఆర్డీఓకు విన్నవిస్తున్న నేతలు

**సిద్దిపేట అర్బన్, మే 27, ప్రభాతవార్త :** రైతులు మార్కెట్ యార్డులకు, కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ప్రతి ధాన్యం గింజను రేవంత్‌రెడ్డి సర్కార్ కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తుందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం.డి.ఇమామ్(అత్తు) అన్నారు. ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ సదానందంను బుధవారం పార్టీ శ్రేణులతో కలిసి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని విన్నవించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి తడిసిన వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఒకపక్క ధాన్యం తడిసిపోయి రైతులు ఇబ్బందులుపడుతుంటే బిఆర్ఎస్ మరోపక్క నీచ రాజకీయాలకు పాల్పడుతుందన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని బిఆర్ఎస్, బిజెపి ఎన్ని నాటకాలు ఆడినా ప్రజలు నమ్మరని తెలిపారు. ఆయన వెంట పార్టీ నాయకులు మధు, గాయజుద్దీన్, హర్షద్, దస్తగిరి ముదసిరి ఉన్నారు.

## సబ్సిడీపై జీలుగ విత్తనాల పంపిణీ

**బెజ్జంకి, మే 27, ప్రభాతవార్త :** పచ్చిరొట్ట ఎరువుల అయిన జీలుగ, జనుము విత్తనాలు సబ్సిడిపై రైతులకు అందజేశారు. భూసారం పెరుగుదలకు, రసాయన ఎరువుల వాడకం తగ్గడం కోసం పచ్చిరొట్ట ఎరువులను వరి పొలాలల కోసం ప్రధాన పొలంలో చల్లుకొని 45 రోజులలోపు కలియదున్నాలి, విత్తనాలు కావాల్సిన రైతులు పట్టా పాసుబుక్‌తో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎఈవోలు, రైతులు పాల్గొన్నారు.

## వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన అధికారులు

**మర్కుక్, మే 27 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాలలో నిల్వ ఉంచిన ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ సరిత, ఎస్ఐ దామోదర్‌లు బుధవారం ఉదయం కొనుగోలు కేంద్రాలను సందర్శించి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన వారు నష్టపోయిన ధాన్యంపై పూర్తి వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. తడిసిన ధాన్యాన్ని రక్షించేందుకు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అకాల వర్షాలతో ధాన్యం తడవడంతో తమకు భారీ నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడిందని రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన సహాయం అందించాలని కోరారు. కొనుగోలు కేంద్రాలలో నిలిచిన ధాన్యాన్ని లారీలలో వెంటనే తరలించాలని అన్నారు.


తడిసిన ధాన్యంను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్ఐలు

# ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడం సిగ్గుచేటు

### బిఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి


రైతు దీక్షలో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

**గజ్వేల్, మే 27 (ప్రభాతవార్త):** వడ్ల కొనుగోలుపై ప్రభుత్వం మొండివైఖరికి నిరసనగా గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద బిఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతు దీక్షతోపాటు వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. బుధవారం గజ్వేల్ నియోజక వర్గంలోని పెద్దఎత్తున రైతు దీక్షకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి రైతులు పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు మాత్రం దోచుకోవడానికి కలెక్టర్ ఆఫీసుల చుట్టూ, తహసీల్దార్, పోలీస్ స్టేషన్ల చుట్టూ పైరవీలు, అవినీతి అక్రమాలు, భూకబ్జాలు చేసి పాలనను గాలికి వదిలేశారన్నారు. నియోజకవర్గంలో 30 శాతం వడ్లు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కొనలేదని, 70 శాతం వడ్లు కొనుగోలు కేంద్రాల వద్ద,రోడ్లపై ఉన్నాయన్నారు. వడ్లను రైస్ మిల్లర్లకు పంపించి రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సింగిల్ డిపాజిట్ కూడా రాదని, రైతులను మోసం చేసిన ప్రభుత్వం అధికారం దిగక తప్పదన్నారు. వడ్లను కాంగ్రెస్ ప్రభుత్వం చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని, నియోజకవర్గంలోని రైతులు అందరూ ఏకతాటిగా వచ్చి నిరసన తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. 45 డిగ్రీల ఎండలో సైతం రైతులు వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదని విమర్శించారు. గత ప్రభుత్వం రైతులను రాజుగా చేసిందని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచుతున్నారన్నారు. వెంటనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కళ్లు తెరిచి వడ్లతో పాటు తడిచిన ధాన్యం సైతం కొనుగోలు చేయాలని లేనిపక్షంలో పెద్దఎత్తున రాజీవ్‌రహదారులను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళలు, రైతులు పాల్గొన్నారు.


ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

## ఫర్టిలైజర్ దుకాణాలలో టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీలు

### -ఫర్టిలైజర్ యజమానికి నోటీసుల జారీ

**గజ్వేల్, మే 27 (ప్రభాతవార్త):** పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలలో బుధవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి ఏడిఏ కాంపాటి మల్లయ్య, సిఐ శ్రీధర్, స్థానిక ఏడిఏ బాబునాయక్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని శ్రీలక్ష్మీ వెంకటరమణ ట్రేడర్స్ విత్తనాల,పురుగు మందుల షాపులను తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్లు, బిల్లు బుక్‌లను పరిశీలించారు. లైసెన్స్ కలిగిన కంపెనీల విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను మాత్రమే విక్రయించాలని, ధరలు, స్టాక్‌బోర్డులను షాపుల ముందు ఏర్పాటు చేయాలని సంబంధిత దుకాణాల యజమానులను హెచ్చరించారు. నకిలీ విత్తనాలు అమ్మితే పిడి చట్టం ద్వారా కేసులు నమోదుచేసి చట్టపరమైన చర్యలు తీసు కోవడం జరుగుతుందన్నారు. శ్రీలక్ష్మీ వెంకటరమణ ట్రేడర్స్ ప్రజ్ఞాపూర్ షాపును తనిఖీ చేసి రూ.26,83,588 విలువైన విత్తనాలకు విక్రయ నిలుపుదల నోటీస్ జారీచేశారు. అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు అమ్మితే కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. కాలం చెల్లిన విత్తనాలు అమ్మినచో చట్ట ప్రకారం శిక్షించబడతారని హెచ్చరించారు. 1966 చట్ట ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. వారి వెంట రాయపోల్ ఏవో నరేష్, ఎస్ఐ సురేష్, కానిస్టేబుల్ బాబు, హోంగార్డ్ శ్రీనివాస్ ఉన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

**సిద్దిపేట అర్బన్, మే 27, ప్రభాతవార్త:** ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించి అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు అనర్హుల ఓట్లు తొగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త గాదగోని చక్రధర్‌గౌడ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఎస్ఐఆర్‌లో సిద్దిపేట నియోజకవర్గంలో పెద్దఎత్తున దొంగ ఓట్ల బండారం బట్టబయలైందన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ఓటర్ల జాబితా ప్రకారం సిద్దిపేటలో 1 లక్ష 12 వేల ఓట్లు ఉండగా అందులో 50 వేల పై చిలుకు ఆన్ మ్యాప్డ్ ఓట్లు ఉండడం ఆందోళనకు గురిచేసే అంశమన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో 56 వుల అన్ మ్యాప్డ్ ఓట్లు ఉన్నట్లు అధికారుల లెక్కల ప్రకారం తెలుస్తుందన్నారు. అన్ మ్యాప్డ్ ఓట్లు తొలగించకుండా కొందరూ నాయకులు ప్రైవేటు వ్యక్తులతో ధృవీకరించే విధంగా అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. ఈవిషయమై భారత, తెలంగాణ ఎన్నికల సంఘానికి, తెలంగాణ చీఫ్ సెక్రెటరీ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఓటర్ల గుర్తింపు కోసం పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించి అర్హులకు ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని చక్రధర్‌గౌడ్ డిమాండ్ చేశారు.

## తడిసిన ప్రతి గింజను కొనుగోలు చేయాలి

### సిపిఎం మండల కార్యదర్శి తాడూరి రవీందర్

**కొమురవెల్లి, మే 27 ప్రభాతవార్త :** మండలంలోని అయినాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకెపి వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సిపిఎం పార్టీ నాయకులు పరిశీలించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన వడ్లు తడిసి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఎం మండల కార్యదర్శి తాడూరి రవీందర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో ఐకెపి కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం బస్తాలు వర్షానికి తడిసిపోయాయని తెలిపారు. తడిసిన ధాన్యం పేరుతో రైతులకు కొర్రలు పెట్టడం, కటింగ్‌లు విధించడం అన్యాయమని అన్నారు. తడిసిన ప్రతి ధాన్యం గింజను కూడా ప్రభుత్వమే పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు ప్రక్రియలో జాప్యం, సకాలంలో లారీలు అందుబాటులో లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. వెంటనే మార్కెటింగ్ శాఖ అధికారులు స్పం దించి కొనుగోలు కేంద్రాల వద్ద లారీలను ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు, నాయకులు ఉల్లంపల్లి సాయిలు, సున్నం యాదగిరి, కానుగుల రాజు, పాకనాటి బాలు, రైతులు పాల్గొన్నారు.


సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

## 'గో టు విలేజ్'ను విజయవంతం చేయాలి

**బెజ్జంకి, మే 27,ప్రభాతవార్త :** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు బుధవారం బెజ్జంకిలో అనుబంధ సంఘాల సమీక్ష సమావేశం మండల అధ్యక్షులు వడ్లూరి పర్శ రాములు ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మంద కుమార్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు స్మార్ట్ ప్రకాష్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మాదిగ సామాజిక వర్గంలో డ్రాప్ అవుట్ తగ్గించి విద్యా అవకాశాలు అందిపుచ్చుకునేలా మార్గ నిర్దేశం చేసి అక్షరాస్యతను పెంపొందించడం కోసం జూలై 5 వరకు 40 రోజుల పాటు గో టూ విలేజ్ ప్రోగ్రాం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 32వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలో నూతన జెండా గద్దెను నిర్మాణం చేసుకొని మాదిగ జాతి పండగ ఎమ్మార్పీఎస్ జెండా పండుగ జరుపుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బోనగిరి చంద్రం, మోదంపల్లి రాజు, బోనగిరి భూమయ్య, కన్నం నరేష్, బోనగిరి కనకయ్య, కనగర్ల రాజయ్య, సోమని బాలయ్య, బోనగిరి లింగయ్య తదితరులు పాల్గొన్నారు. లింగాల శ్రీనివాస్ మాదిగ యువ న్యాయవాది బెజ్జంకి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియామకమైన సందర్భంగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సత్కారించారు.

## రమాబాయి అంబేద్కర్‌కు ఘన నివాళి


రమాబాయిఅంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**కోహెడ, మే 27, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని కోహెడ అంబేద్కర్ విగ్రహం వద్ద సామాజిక కార్యకర్త డాక్టర్ వెల్పుల శంకర్ ఆధ్వర్యంలో బుధవారం మాత రమాబాయి అంబేద్కర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మాత రమాబాయి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బి.ఆర్. అంబేద్కర్ విజయం వెనుక మాతా రమాబాయి పాత్ర ఎంతో కీలకంగా ఉందన్నారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త పిడిశెట్టి రాజు, ప్రజా రాజ్యాధికార పార్టీ నాయకులు మంతిని శ్రీకాంత్, తోట చంద్రయ్య, రజిత, బాబు,పోచమ్మ తదితరులు పాల్గొన్నారు.

## జవహర్‌లాల్ నెహ్రూకు ఘన నివాళులు

**కొమురవెల్లి, మే 27, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారత తొలి ప్రధానమంత్రి, భారతరత్న పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. నాయకులు, కార్యకర్తలు నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మహాదేవుని శ్రీనివాస్ మాట్లాడుతూ, భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఆధునిక భారత నిర్మాణ శిల్పిగా దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి గ్రామ శాఖ అధ్యక్షులు లింగంపల్లి కనకరాజు, ఐనాపూర్ గ్రామ శాఖ అధ్యక్షులు మల్లం బాలయ్య, ఆత్మ కమిటీ డైరెక్టర్ చింతల పరశురాములు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఏర్పుల రాజు, యూత్ కాంగ్రెస్ సెక్రెటరీలు ఉప్పల వంశీకృష్ణ, ఎనిశెట్టి కిరణ్, గౌరాయపల్లి యూత్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు పాల్గొన్నారు.

# బాల్క సుమన్ వ్యాఖ్యలు బాధ్యతారహితం

### కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు అక్కు శ్రీనివాస్


బాల్క సుమన్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**హుస్నాబాద్ టౌన్, మే 27, ప్రభాతవార్త**

బిఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన మిలిటెంట్ యాక్టివిటీ వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకుని తక్షణమే అరెస్ట్ చేయాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు అక్కు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ బుధవారం పార్టీ నాయకులతో కలిసి హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం అక్కు శ్రీనివాస్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో యువతను, ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయని, నిరసనలు, ధర్నాలు వంటి ప్రజాస్వామ్య కార్యక్రమాలను మానుకుని ఉద్యమాల బాట పట్టాలని, మిలిటెంట్ తరహా కార్యక్రమాలు చేయాలని కార్యకర్తలకు పిలుపునివ్వడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం, సింగరేణి భవనాలను కూల్చి వేయడం, రైలు పట్టాలను విరగొట్టాలని వ్యాఖ్యానించడం ద్వారా కార్యకర్తలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇటువంటి వ్యాఖ్యలు రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. బాల్క సుమన్ మాట్లాడిన వీడియోలు, పత్రిక క్లిప్పింగులను ఫిర్యాదుకు జత చేసి హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో అందజేశామని తెలిపారు. ఈ వ్యవహారంపై సుమోటోగా కేసు నమోదు చేసి రాష్ట్ర డీజీపీ తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ వ్యాఖ్యలపై సమాధానం చెప్పాలని, బాల్క సుమన్‌పై పార్టీ పరంగా కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. బాల్క సుమన్ తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కితీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఫిర్యాదులో స్థానిక కౌన్సిలర్ పూదరి వరప్రసాద్, కాంగ్రెస్ నాయకులు బూరుగు కృష్ణ స్వామి, పున్న సది, మాజీ ఎంపీటీసీ భాస్కర్ నాయక్, గుగులోతు రాజునాయక్, పున్న రంజిత్, దినేష్, భాస్కర్ నాయక్ పాల్గొన్నారు.


కొత్తపల్లి బస్టాండ్ వద్ద రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

## కొత్తపల్లి బస్టాండ్ ఎదుట రైతుల ధర్నా

**రాయపోల్, మే 27 (ప్రభాతవార్త):** రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రానికి లారీలు సమయానికి రాకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఐకెపి కొనుగోలు కేంద్రంలో ధాన్యం నిల్వలు పేరుకుపోవడంతో, తమ పంట ఎప్పుడు తరలిస్తారో తెలియక రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కొత్తపల్లి బస్టాండ్ వద్ద భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. ధర్నాతో కొంతసేపు రహదారిపై వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోగా, విషయం తెలుసుకున్న తహసీల్దార్ కృష్ణ మోహన్, ఏపిఎం యాదగిరి, తొగుట సిఐ లతీఫ్ వెంటనే అక్కడికి చేరుకొని రైతులతో చర్చలు జరిపారు. ధాన్యం తరలింపుకు తక్షణమే లారీలు పంపిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించి ఆందోళనను విరమించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఆలస్యం జరుగుతుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని కొనుగోలు కేంద్రాలకు సరిపడా లారీలు అందుబాటులో ఉంచాలని రైతులు డిమాండ్ చేశారు.

### బయ్యారం గ్రామంలో...


రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న రైతులు

**గజ్వేల్ టౌన్, మే 27 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం బయ్యారం గ్రామానికి చెందిన రైతులు బుధవారం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బయ్యారం గ్రామ శివారులోని శారద రైస్‌మిల్లు వారు వడ్లు తీసుకోము అని చెప్పడంతో ధర్నా చేయడం జరిగిందన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం అకాల వర్షాలకు తడిసిపోతుందన్నారు. ఎన్నికల ముందు అమలుకాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఈ ప్రభుత్వ హయాంలో రైతులు పండించిన పంటను కొనే దిక్కు లేదని విమర్శించారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బయ్యారం గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అకాల వర్షం.. అపార నష్టం.. రైతుల కంటతడి

### పట్టించుకోని ఐకెపి అధికారులు


తడిచిన ధాన్యం బస్తాలు

**చిలిపిచెడ్, మే 27 ప్రభాతవార్త :** మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికివరి ధాన్యం తడిసి రైతులను కంటతడి పెట్టిస్తుంది. మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలంలో మంగళవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి ధాన్యం బస్తాలు, ఆరబోసిన ధాన్యం రాశులు, తడిసి ముద్దయ్యాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కనీస సౌకర్యాలు లేకపోవడమేకాకా అధికారుల ఆలసత్వం తోడైంది. రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే రైస్ మిల్లులకు తరలించాలి. కాని ఫైజాబాద్ గ్రామంలో తూకం వేసి వారం రోజులు గడుస్తున్నా రైస్ మిల్లులకు తరలించకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో అకాల వర్షానికి వరి ధాన్యం బస్తాలు కాస్త తడిసి ముద్దయ్యాయని రైతన్నలు ఆరోపించారు. ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి ఏర్పడిందని, అధికారుల పనితీరుపై రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చివరికి ప్రభుత్వానికి అమ్ముకొని ఆదాయాన్ని పొందే సమయంలో అధికారులు ఓవైపు, వర్షం మరో వైపు రైతులకు కంటతడి పెట్టిస్తుంది. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి వరి ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వహించకుండా వేగంగా కొనుగోళ్ళను జరిపి వెనువెంటనే ధాన్యం బస్తాలను రైస్ మిల్లులకు తరలించి రైతులకు న్యాయం చేయాలని వారి డిమాండ్ చేశారు.

## కళ్యాణలక్ష్మి చెక్కులు పంచాలంటూ బిజెపి ధర్నా

గజ్వేల్, మే 27 (ప్రభాతవార్త): కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంచాలని బిజెపి ఆధ్వర్యంలో బుధవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, బిజెపి పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను అధికారులు లబ్ధిదారులకు పంచాలన్నారు. మాజీ సిఎం కెసిఆర్ నియోజకవర్గంలో కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడం సిగ్గుచేటన్నారు. పేదల పట్ల ఎందుకు ఇంత వివక్ష అని, కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో జిల్లా మంత్రి వివేక్ వెంకటస్వామి, గజ్వేల్ ఎమ్మెల్యే కెసిఆర్‌లు వెంటనే చొరవ తీసుకొని చెక్కులు పంపిణీ అయ్యే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. ఆర్డీవో కార్యాలయం ముందు బిజెపి నాయకులు నిరసన తెలుపుతున్న విషయాన్ని తెలుసుకున్న గజ్వేల్ అడిషనల్ సిఐ ముత్యంరాజు సిబ్బందితో అక్కడికి చేరుకొని బిజెపి నాయకులను శాంతింపజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్, సీనియర్ నాయకులు కుడిక్యాల రాములు, బిజెపి కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్, పలు మండలాల అధ్యక్షులు సాయిరెడ్డి రాంరెడ్డి, అనుముల సంపత్‌రెడ్డి, బొల్లిపల్లి తిరుపతిరెడ్డి, చెప్యాల వెంకట్‌రెడ్డి, ఎల్కంటి సురేష్, ఆలేటి సుమతి, ప్రధాన కార్యదర్శులు నాయిని సందీప్‌కుమార్, నరసింహ ముదిరాజ్, బారు అరవింద్, ఇప్ప స్వామి, మహేందర్, నాగు ముదిరాజ్, భాస్కర్‌రెడ్డి, మర్కంటి ఏగొండ, మంద వెంకట్, సల్లె శ్రీనివాస్, పిట్ల శ్రీనివాస్, న్యాయవాది ఎన్నెల్లి స్వామి, పవన్‌కుమార్, హరికుమార్, తలారి రాజు, దయాకర్‌రెడ్డి, కుర్ర స్వామి, మంగళపల్లి సత్యనారాయణ, మహేష్‌చారి, రాజేశ్వర్‌చారి, కొమ్ము చంద్రశేఖర్, ప్రవీణ్‌గౌడ్, శ్రీనివాస్, గాండ్ల భాను, అఖిల్, రెడ్డమైన శ్రీనివాస్, బోనగిరి చందు, బాలచంద్రం తదితరులు పాల్గొన్నారు


నిరసన తెలుపుతున్న బిజెపి నాయకులు

# అందోలు అభివృద్ధికి మంత్రి దామోదర్ కృషి

-తాజాగా రూ. 57.50కోట్లతో ఫార్మసీ కళాశాల మంజూరు
-అందోలు-జోగిపేట మున్సిపల్ చైర్మెన్ ఎస్.క్రిష్ణారెడ్డి
-మంత్రి దామోదర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న అందోలు-జోగిపేట మున్సిపల్ చైర్మెన్ ఎస్.క్రిష్ణారెడ్డి

**జోగిపేట, మే 27, ప్రభాతవార్త:**
అందోలు నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అనునిత్యం కృషి చేస్తున్నారని అందోలు-జోగిపేట మున్సిపల్ చైర్మెన్ ఎస్.క్రిష్ణారెడ్డి తెలిపారు. బుధవారం జోగిపేటలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గాన్ని ఎద్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకుగాను ఇప్పటికే ఎన్నో కళాశాలలను అందుబాటులోకి తీసుకురాగా, తాజాగా రూ.57.50కోట్లతో ఫార్మసీ కళాశాల మంజూరు చేయించారని తెలిపారు. దీనికోసం రూ. 70కోట్లతో ప్రతిపాదనలుపంపగా, ఫార్మసీ కళాశాలను మంగళవారం మంజూరుచేసినట్లు తెలిపారు. ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే కేవలం విద్యతోనే సాధ్యమని, అందుకే అందోలులో అన్ని రకాల విద్యావకాశాలు కల్పించాలనే దృఢసంకల్పంతో మంత్రి కృషిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలో వందలకోట్ల రూపాయలతో అభివృద్ధిపనులు జరుగుతున్నాయని, నియోజకవర్గ కేంద్రమైన జోగిపేట అభివృద్ధికోసం మంత్రి ప్రత్యేకశ్రద్ధ చూపుతున్నారని అన్నారు. కాగా తాజాగా ఫార్మసీ కళాశాల మంజూరు పట్ల మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ అంజయ్య, డిసిఎంఎస్ మాజీ డైరెక్టర్ ఎస్. జగన్మోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మెన్ ఆకుల సత్యనారాయణ, కౌన్సిలర్లు కౌశికె రాజశేఖర్, శ్రీనివాస్, అరుణ్‌కుమార్, మాజీకౌన్సిలర్లు సురేందర్‌గౌడ్, పట్లోల్ల ప్రవీణ్‌కుమార్, కో-ఆప్షన్ సభ్యులు జీషాన్, ప్రవీణ్, మండల పార్టీ అధ్యక్షులు శివరాజ్, కాంగ్రెస్ నాయకులు పిట్ల లక్ష్మన్, దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

**మంత్రి దామోదర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం...**
అందోలు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు మంత్రి దామోదర్ రాజనర్సింహ చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ అందోలు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు బుధవారం జోగిపేటలోని జోగినాథచౌరస్తాలో మంత్రి దామోదర్ రాజనర్సింహ ఫ్లెక్సీకి పాలతో అభిషేకం చేశారు. ఈసందర్భంగా వారు మంత్రి దామోదర్ రాజనర్సింహ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం నూతనంగా ఫార్మసీ కళాశాల మంజూరు పట్ల స్వీట్లు పంచి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## గోవధను, అక్రమ రవాణాను అడ్డుకోండి

-పోలీసులకు భజరంగ్‌దళ్ వినతి



పోలీసులకు వినతి పత్రం అందచేస్తున్న భజరంగ్‌దళ్ ప్రతినిధులు

**సిర్గాపూర్, మే 27, ప్రభాతవార్త:**
బక్రీద్ పండగను పురస్కరించుకుని గోవధను, గోవుల అక్రమ రవాణాను అడ్డుకోవాలని భజరంగ్‌దళ్ ప్రతినిధులు బుధవారం పోలీసులకు వినతి పత్రం అందచేశారు. ఈసందర్భంగా భజరంగ్‌దళ్ ప్రతినిధులు మాట్లాడుతూ మండలంలో గోవధ జరిగినా, అక్రమ రవాణా కొనసాగినా, చట్టవిరుద్ధంగా గోవులను తరలించినా ఉపేక్షించేదిలేదని, భజరంగ్‌దళ్ సభ్యులు అప్రమత్తంగా ఉన్నారని, అడ్డుకుంటామని స్పష్టంచేశారు.

## నర్సరీలను పరిశీలించిన ఎపిడి


నర్సరీలను పరిశీలిస్తున్న ఎపిడి పూజ దృశ్యం

**మొగుడంపల్లి, మే 27, ప్రభాతవార్త:**
మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న నర్సరీలను ఎపిడి పూజ బుధవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. నర్సరీల్లో మొక్కల సంరక్షణ సరిగ్గా లేకపోవడంపై పూజ నిర్వాహకులపై అసంతృప్తి వ్యక్తంచేశారు. నర్సరీల్లోని ప్రతి మొక్కను జాగ్రత్తగా సంరక్షిస్తూ సమయానికి నీరు అందించాలని సూచించారు. నర్సరీల్లో పరిశుభ్రత, నిర్వహణ మెరుగుపర్చాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల అభివృద్ధిలో పచ్చదనం కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ మహేష్, ఎపిఓ గణేష్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

## బొక్కన్‌గావ్ సొసైటీలో అవినీతి

-ఆందోళనకు దిగిన రైతులు



రైతుల అభిప్రాయాలను సేకరిస్తున్న అధికారులు

**సిర్గాపూర్, మే 27, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని బొక్కన్‌గావ్ సొసైటీలో అవినీతి చోటుచేసుకుందని తెలియడంతో రైతులు ఆందోళనకు దిగారు. వడ్లను సొసైటీ ద్వారా కాకుండా ఐకెపి ద్వారా కొనుగోలుచేయడం సరికాదని రైతులు సొసైటీ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళనకు దిగారు. సొసైటీ కార్యాలయం వద్ద రైతులు ఆందోళనకుదిగినట్లు తెలుసుకున్న సబ్‌కలెక్టర్ ఉమాహారతి తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్ఐ మదన్‌మోహన్‌లు కేంద్రాన్ని సందర్శించారు. సబ్‌కలెక్టర్ ఉమాహారతి రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వడ్లను కొనుగోలుచేస్తున్న ఐకెపినుంచి తాము సమస్యలను ఎదుర్కొంటున్నామని రైతులు పేర్కొన్నారు. సొసైటీద్వారానే వడ్లను కొనుగోలుచేయాలని రైతులు వినతిచేశారు.

**జొన్నలను కొనుగోలు చేయాలి-రైతుల డిమాండ్...**
జొన్నరాసులు పూర్తయి పక్షంరోజులు గడుస్తున్నా కొనుగోలుకేంద్రం ఏర్పాటు చేయకపోవడంపట్ల మండలంలోని అంతర్గాం గ్రామ రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. రైతులవద్ద 80లారీల మేరకు జొన్నలు సిద్ధంగా ఉన్నాయని, వెంటనే అధికారులు స్పందించి జొన్నల కొనుగోలుకేంద్రాన్ని ఏర్పాటుచేయాలని రైతులు వినతిచేస్తున్నారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతులకు నష్టం: సర్పంచ్

**మర్కుక్, మే 27, ప్రభాతవార్త:**
కొనుగోలు కేంద్రాలకు రైతులు తరలించిన ధాన్యాన్ని వెనువెంటనే లారీల్లో తరలించకపోవడం వల్లే రైతులకు తీవ్రనష్టం వాటిల్లిందని, దీనికి కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణమని మర్కుక్ సర్పంచ్ రాణిమల్లేశం ఆరోపించారు. మంగళవారంరాత్రి కురిసిన అకాలవర్షంతో కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం పూర్తిగా తడిసిపోవడంతో బుధవారం తడిసినధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఎంతో శ్రమించి యాసంగిలో పంటలు పండించినప్పటికీ, సరైన నిర్వహణ లేకపోవడంతో నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వనిర్లక్ష్యం కారణంగానే రైతుల ధాన్యం రోడ్లపైనే నిల్వ ఉండడంతో నష్టపోతున్నారని, తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం వెంటనే కొనుగోలుచేసి రైతులకు అండగా నిలవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సాయిని మహేష్, నాయకులు రవి, ఐలయ్య, శ్రీకాంత్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లులో తహసీల్దార్ ఆకస్మిక తనిఖీ

-తడిసిన ధాన్యాన్ని ప్రాధాన్యతగా దిగుమతి చేయాలని ఆదేశం



కోనాపూర్ రైస్‌మిల్‌ను తనిఖీచేస్తున్న తహసీల్దార్ రజనీకుమారి

**రామాయంపేట, మే 27, ప్రభాతవార్త:**
రామాయంపేట మండలం కోనాపూర్‌లోని సాయిగీతా రైస్‌మిల్లును తహసీల్దార్ రజనీకుమారి బుధవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. మిల్లులోని ధాన్యంనిల్వలను, దిగుమతిప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈసందర్భంగా వర్షాలకు తడిసిన ధాన్యం రైతులనుంచి వస్తున్న నేపథ్యంలో, నష్టం జరగకుండా చూసేందుకు తడిధాన్యాన్ని ప్రాధాన్యత క్రమంలో వెంటనే దిగుమతిచేసుకోవాలని మిల్లర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సహకరించాలని, ధాన్యం తూకం, దిగుమతిలో జాప్యం చేయవద్దని సూచించారు. తడిసిన ధాన్యం ఎక్కువసేపు నిల్వ ఉంటే మొలకెత్తే ప్రమాదం ఉందని, దీనివల్ల రైతులు నష్టపోతారని అధికారిణి పేర్కొన్నారు. మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ రైతులకు అండగా నిలవాలని ఆమె కోరారు. ఆమెవెంట ఆర్ఐ మహ్మద్ గౌస్ తదితరులు ఉన్నారు.

## తహసీల్దార్ కార్యాలయం ముందు వివోఏల నిరసన



సమస్యల సాధనకు నిరవధిక సమ్మె చేస్తున్న వివోఏలు

**పాపన్నపేట, మే 27, ప్రభాతవార్త:**
తమ న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని వివిధ గ్రామాల వివోఏలు శాంతియుత నిరవధిక సమ్మెకు దిగారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు సాయగౌడ్ మాట్లాడుతూ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ పరిధిలో రాష్ట్రంలో 17వేల667మంది వివోఏలుగా పనిచేస్తున్న మహిళాసంఘాలను సామాజికంగా, ఆర్థికంగా బలోపేతం చేస్తూ, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, చైతన్యపరుస్తూ, సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నప్పటికీ, తమసమస్యలు పరిష్కారం కావడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. వేతనాలపెంపు, ఉద్యోగభద్రత, ప్రమాద బీమా వంటి ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం స్పందించేవరకు తమ ఆందోళన కొనసాగుతుందని స్పష్టంచేశారు. ఈసమ్మెలో వివోఏలు ప్రతిభ, దాసు, నర్సింలు, మంగదేవి, అనిత, మమత, భాగ్యలక్ష్మి, దుర్గేష్, సాయిలు, బషీర్‌లు పాల్గొన్నారు.

## రోడ్లపై పడిపోయిన చెట్లను తొలగించిన పాలకవర్గం

**కొండపాక, మే 27, ప్రభాతవార్త:**
మంగళవారంరాత్రి ఈదురుగాలులతో కూడిన అకాలవర్షం కురవడంతో వానతో కుకునూరుపల్లి మండలపరిధిలోని లకుడారం గ్రామం నుండి రాజీవ్ రహదారి వైపు రోడ్డుపైన, లకుడారం నుండి తిమ్మారెడ్డిపల్లి వైపు రోడ్డుపైన చెట్లు పడిపోయి వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పాడింది. ఈ విషయం తెలుసుకున్న వెంటనే సర్పంచ్ శిల్పనర్సింలు, ఉపసర్పంచ్ యెల్లు శ్రీనివాస్ రెడ్డి, వార్డుసభ్యులు రాచకొండ లావణ్యబిక్షపతి, కళ కర్ణాకర్, గట్టు చంద్రం, వంకని రాజు, ప్రవీణ్, కారోబార్ గణేష్, పంచాయతీసిబ్బందితోకలిసి రోడ్లపై పడిపోయిన చెట్లను, చెట్లకొమ్మలను పక్కకుతొలగించి వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయంలేకుండా చర్యలుచేపట్టి రోడ్లను క్లియర్‌చేశారు.

## తడిసి ముద్దయిన వరి కుప్పలు


కొనుగోలు కేంద్రం వద్ద తడిసిన ధాన్యం

**వర్గల్, మే 27, ప్రభాతవార్త:**
వర్గల్ మండలంలో మంగళవారంరాత్రి కురిసిన అకాలవర్షానికి వరి కుప్పలు తడిసి ముద్దయ్యాయి. మండల పరిధిలోని మైలారం, చౌదరిపల్లి, శేరిపల్లి, జబ్బాపూర్, సింగాయపల్లి, చాంద్‌ఖాన్‌మక్త, గౌరారం తదితర గ్రామాలలో రైతులు కొనుగోలుకేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం నీటిపాలు కావడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

## రైల్వే అండర్ బ్రిడ్జిల్లో నిలిచిన వర్షపునీరు


శంకాపూర్ రైల్వే బ్రిడ్జి కింద నిలిచిన వర్షపునీరు

**నార్సింగి, మే 27, ప్రభాతవార్త:**
నార్సింగి మండలం శంకాపూర్ గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి కురిసిన ఒక భారీవర్షానికి రైల్వే అండర్ బ్రిడ్జిలో భారీగా నీరు చేరింది. బ్రిడ్జిలలో నీరు చేరడంతో ఆగ్రామాలకు రాకపోకలు నిలిచాయి. అండర్ డ్రైనేజ్ నిర్మాణం చేపట్టకపోవడంతో భారీగా నీరునిలిచిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇలాగే నిర్మాణంచేపట్టకపోతే వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటామని రైల్వే అండర్ బ్రిడ్జిల కింద నీరు దాదాపు రెండు అడుగుల మేర ఎత్తు నిల్వ ఉండటంతో 44వ జాతీయ రహదారి నుంచి శంకాపూర్ మీదిగా ఖాజాపూర్ మెదక్ వెళ్లాలంటే భయంభయంగా ఉందని గ్రామస్థులు తెలుపుతున్నారు. దీంతో మెదక్ ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే రామాయంపేట మీద నుంచి ఎనిమిది కిలోమీటర్ల తిరిగి వెళుతున్నామని వారు వాపోతున్నారు. అండర్‌బ్రిడ్జి కింది నుంచి ద్విచక్రవాహనదారులు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. బ్రిడ్జిలో అధికంగా నీళ్లు నిలబడటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అనే ఆందోళన నెలకొందని తెలిపారు. ఇలా నీరు నిల్వ ఉంటే బ్రిడ్జిలు నిర్మించి ఏమీ ఫలితంలేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అండర్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## ఆగం చేసిన వాన.. నీటి పాలైన ధాన్యం..


కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

**నార్సింగి, మే 27, ప్రభాతవార్త:**
మంగళవారం అర్ధరాత్రి కురిసిన భారీవర్షం అన్నదాతలను అతలాకుతలం చేసింది. గత కొన్ని రోజులుగా భానుడి భగభగలతో అల్లాడిపోతున్న ప్రజలకు నిన్నరాత్రి కురిసిన వర్షం కాస్త ఉపశమనం ఇచ్చినప్పటికీ, రైతన్నలను మాత్రం కోలుకోలేని దెబ్బతీసింది. వివరాల్లోకి వెళితే, నార్సింగి మండలం శేరిపల్లి గ్రామంలో సాయంత్రం వర్షంపడడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ఒక్కసారిగా వర్షంకురియడంతో ధాన్యంపై కవర్లుకప్పే సమయంకూడా రైతులకు లభించలేదు. దీంతో ఆరబెట్టిన ధాన్యంతోపాటు, ధాన్యపుబస్తాలు తడిసిపోయాయి. ఇదిలా ఉండగా, ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అకాలవర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో కొనుగోలు కేంద్ర నిర్వాహకుడి నిర్లక్ష్యం రైతుల ఆగ్రహానికి కారణమైంది. డబ్బులు ఇచ్చిన రైతుల వడ్లకే ముందుగా తూకంవేస్తూ, సీరియల్ ప్రకారం వడ్లు ఆరబోసిన రైతులను పక్కన పెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. సమయానికి తూకం వేయకపోవడంతో రాత్రిపడిన అకాలవర్షానికి వడ్లు పూర్తిగా తడిసిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలని ఈ సందర్భంగా రైతులు కోరారు.

## ధాన్యం త్వరగా కొనుగోలుచేసి మిల్లులకు పంపించాలి

-కొండపాక సర్పంచ్ మంచాల నవీన్‌శ్రీనివాస్


తడిసిన ధాన్యాన్ని తహసీల్దార్‌కు చూపిస్తున్న రైతులు

**కొండపాక, మే 27, ప్రభాతవార్త:**
మంగళవారంరాత్రి కురిసిన అకాలవర్షానికి తడిసిముద్దయిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలంటూ కొండపాక సర్పంచ్ మంచాల నవీన్‌శ్రీనివాస్, వార్డుసభ్యులు, మాజీ రైతుసమన్వయసమితి సభ్యుడు మహిపాల్‌రెడ్డి బుధవారం కొనుగోలుకేంద్రానికి వెళ్ళి ధాన్యం పరిశీలించి, రైతులను పరామర్శించారు. అనంతరం సర్పంచ్ తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డికి ఫోన్‌లో విషయం తెలుపడంతో వెంటనే ఆయన అక్కడకి చేరుకున్నారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వీలైనంత త్వరగా లారీలు తెప్పించి ధాన్యం కొనుగోలుకు చర్యలుతీసుకుంటామని తెలిపారు. కాంగ్రెస్‌ప్రభుత్వం రైతులను పటించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని రైతులు మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుప్రభుత్వమని గొప్పలు చెప్పుకోవడం తప్ప, రైతులకు ప్రభుత్వం చేసిందేమీలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సరైన సమయంలో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పకతప్పదన్నారు.

## జొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలి

-తహసీల్దార్‌కు బిజెపి నేతల వినతి


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బిజెపి నాయకులు

**రామాయంపేట, మే 27, ప్రభాతవార్త:**
రామాయంపేట మండలంలో తక్షణమే జొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలని బిజెపి మండలశాఖ డిమాండ్‌చేసింది. ఈమేరకు మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్దార్ రజనీకుమారికి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ సూచనల మేరకు ప్రత్యామ్నాయ పంటగా జొన్న సాగు చేసిన రైతులను, ఇప్పుడు కొనుగోలుచేయకుండా ఇబ్బందులకు గురిచేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే మద్దతుధరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని వారు డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో రైతాంగంతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అధికారయంత్రాంగాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, మండల ప్రధానకార్యదర్శి ఆర్.దిలీప్‌కుమార్, సర్పంచులు బక్కయ్యగారి యాదగిరి, మస్కూరి బాలరాజు, ఉపసర్పంచ్ ప్రశాంత్, మాజీసర్పంచ్ సిద్ధరాములు, పట్టణ మాజీ అధ్యక్షుడు భానుచందర్, యువమోర్చా అధ్యక్షులు నాగరాజు, ఓబిసి జిల్లా నాయకులు నవాత్ రాజేంద్రప్రసాద్, కె.వినయ్, సంతోష్, పట్టణ నాయకులు నితిన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

-ఎంపిడిఓ మంజుల సూచన


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ మంజుల దృశ్యం

**ఝరాసంగం, మే 27, ప్రభాతవార్త:**
మహిళలు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్థిరపడాలని ఎంపిడిఓ మంజుల అన్నారు. బుధవారం మండల కేంద్రమైన ఝరాసంగంలోని పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలో ప్రజాపాలన-ప్రగతిప్రణాళికలో భాగంగా మహిళావారోత్సవాల్లో భాగంగా మూడవరోజు మండల సమాఖ్య సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపిడిఓ మంజుల ముఖ్యఅతిథిగా హాజరైనారు. మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణలో మహిళల బాధ్యత అవసరమని గుర్తుచేశారు. ఐసిడిఎస్ సిడిపిఓ సుశీల మాట్లాడుతూ బాలకార్మికవ్యవస్థను నిర్మూలించాలన్నారు. పనిప్రదేశాల్లో మహిళలపై లైంగికదాడులు జరుగకుండా అరికడతామని మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్, ఎస్ఐ పాటిల్ క్రాంతి కుమార్, ఎపిఎం బాగయ్య, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాధ, చైల్డ్ అండ్ వుమెన్ వెల్ఫేర్ అధికారులు, న్యాయవాది రజనీప్రియ, శంకర్, సిసిలు మహిళాసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## కాలం నెత్తిమీదికొచ్చినా కదలని ధాన్యం

-ధాన్యం కొనుగోలు చేయాలని రోడ్డుపై బైఠాయించిన రైతులు


రైతులతో మాట్లాడుతున్న ఎస్ఐ కృష్ణారెడ్డి

**జగదేవ్‌పూర్, మే 27, ప్రభాతవార్త:**
వర్షాకాలం నెత్తిమీదికొచ్చినా ఆరునెలలు కష్టపడి పండించిన పంటను సకాలంలో కొనుగోలు చేయక తీవ్రనష్టం వాటిల్లుతుందని జగదేవ్‌పూర్ మండల రైతులు ఆవేదనకుగురయ్యారు. జగదేవ్‌పూర్‌మండలం చాట్లపల్లి గ్రామంలో తాము పండించిన వరిని వెంటనే కొనుగోలు చేయాలని బుధవారం రైతులు రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ లక్షల రూపాయలు అప్పులు తీసుకువచ్చి పంటలను సాగుచేస్తే సరైన సమయంలో ధాన్యం కొనుగోలు చేయాల్సిన ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో మంగళవారంరాత్రి కురిసిన వర్షానికి ధాన్యం తడిసి ముద్దయ్యిందని, రైతుల గోడు ఎవరికీ పట్టదా అని ప్రశ్నించారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదన్నారు. దాదాపు గంటపాటు ధర్నానిర్వహించడంతో రోడ్డుపై వాహనాలు నిలువడంతో స్థానిక ఎస్ఐ జె.కృష్ణారెడ్డి సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పి లారీలను పంపిస్తానని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు.

## రైతులను కన్నీరు పెట్టిస్తున్న గాలివాన

**అల్లాదుర్గం, మే 27, ప్రభాతవార్త:**
మండలంలో మంగళవారం తెల్లవారుఝాము గాలితో కూడి కురిసిన భారీ వర్షానికి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ధాన్యం ఆరబెట్టుకున్న రైతులు ధాన్యం కుప్పలు ఆరిపోవడం సంగతి అటుంచితే పూర్తిగా తడిసి ముద్దయినాయి. ధాన్యం కొనుగోలు కేంద్రంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల నుంచి వరిని కొనుగోలు చేసిన వెంటనే రైసు మిల్లులకు పంపితే సమస్యల ఉత్పన్నం కాకుండా ఉంటుంది. మండల కేంద్రమైన అల్లాదుర్గంతో పాటు ఐబి చౌరస్తా, గడిపెద్దాపూర్, ముస్లాపూర్, కాయిదంపల్లి తదితర గ్రామాల్లో వరిని తూకం వేసి వారం రోజులు గడుస్తున్నా, ధాన్యాన్ని రైసు మిల్లులకు తరలించకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండటంతో అకాలవర్షానికి ధాన్యం తడిసి ముద్దయిందని అన్నదాతలు అందోళన వ్యక్తం చేస్తున్నారు. అల్లాదుర్గం ఐబి చౌరస్తా వద్ద తడిసిన బస్తాలను ఐకెపి అధికారిణి రుక్మిణి పరిశీలించగా రైతులు తడినిన ధాన్యాన్ని చూపిస్తూ అధికారిణిని నిలదీశారు. పక్షం రోజులు గడుస్తున్నా, తూకంవేసిన ధాన్యాన్ని రైసుమిల్లులకు తరలించకుండా ప్రైవేటు వాహనాల్లో తరలించాలని చెప్పడం ఏమిటని రైతులు అధికారిణిని నిలదీశారు. హమాలీలు, లారీల కొరత ఉందని రైతులకు నచ్చచెప్పే యత్నంచేసినా, అధికారిణిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని రైతులు ఐకెపి అధికారిణిని డిమాండ్‌చేశారు.

# రోడ్డుపై బైఠాయించి రైతుల నిరసన

-అకాల వర్షానికి తడిసిన ధాన్యం
కొనుగోలు చేయాలంటూ రైతుల డిమాండ్

**కొండపాక, మే 27, ప్రభాతవార్త:**
ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామంటూ అగ్రహించిన రైతులు రోడ్డుపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో చేపట్టారు. బుధవారం రాజీవ్ రహదారిపై కొండపాక మండల పరిధిలోని దుద్దెడలో, కుకునూరుపల్లిలో రైతులు రోడ్డుపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో చేపట్టారు. దుద్దెడలో చేపట్టిన రాస్తారోకోలో బందారం, అంకిరెడ్డిపల్లి, దుద్దెడ, దర్గా గ్రామాల రైతులు పాల్గొన్నారు. ఈసందర్భంగా అక్కడికి చేరుకున్న బిఆర్ఎస్‌పార్టీ మండల అధ్యక్షుడు కుమార్, మండల మాజీ అధ్యక్షుడు ర్యాగల్ల దుర్గయ్య మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కొనుగోలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నరని మండిపడ్డారు. ధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మంగళవారంరాత్రి కురిసిన అకాలవర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం పూర్తిగా తడిసిపోయిందని, కొన్నిగ్రామాల్లో వర్షానికి ధాన్యం కొట్టుకొనిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసినధాన్యాన్నిసైతం ఒక్కగింజ కూడా మిగులకుండా కొనుగోలు చేయాలని వారు డిమాండ్‌చేశారు. కొన్నిగ్రామాల్లో ధాన్యం కొనుగోలు చేసిన లారీలులేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విషయం తెలుసుకున్న త్రిటౌన్ సిఐ లక్ష్మిబాబు అక్కడికి చేరుకొని రాస్తారోకో విరమించాలని రైతులను కోరగా, అగ్రహించిన రైతులు గత 6రోజుల నుండి కొనుగోలు కేంద్రాల్లోకి లారీలు రాకపోవడంతో ధాన్యం అక్కడే నిలిచిపోయిందంటూ మండిపడ్డారు. సిఐ పై అధికారులతో మాట్లాడి లారీల సమస్యను తీర్చి, తడిసిన ధాన్యం కొనుగోలు చేయడానికి తనవంతుగా కృషిచేస్తానని హామీ ఇవ్వడంతో రాస్తారోకోను విరమించారు. అదేవిధంగా కుకునూరుపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం ఎదురుగా రాజీవ్ రహదారిపై కుకునూరుపల్లి, బొబ్బాయిపల్లి, రామునిపల్లి గ్రామాలకు చెందిన రైతులు ఉదయమే ధాన్యం తడిసిపోయిన కడుపుమంటతో రాస్తారోకో చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతువ్యతిరేక ప్రభుత్వమంటూ, ప్రభుత్వానికివ్యతిరేకంగా నినాదాలుచేశారు. కుకునూరుపల్లి పోలీసులు అక్కడికిచేరుకొని రైతులను సముదాయించి, అధికారులతో మాట్లాడి ధాన్యం కొనుగోలుకు చర్యలుతీసుకుంటామని చెప్పడంతో రాస్తారోకోను విరమించారు. ఈరాస్తారోకోతో కిలోమీటర్ల మేరకు వచ్చిపోయే వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులుపడ్డారు. కార్యక్రమాల్లో అంకిరెడ్డపల్లి సర్పంచ్ గాలి బాలయ్య, దోమల ఎల్లం, నీల వెంకటేష్, రైతులు ప్రతాప్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, కుకునూరుపల్లి, బొబ్బాయిపల్లి, రామునిపల్లి రైతులు పాల్గొన్నారు.